

ఆదోని పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం సమీపంలో ఆదోని-మంత్రాలయం రోడ్డు ఇలా..

ఆదోని.. అధోగతి

- భూకబ్జాలకు కేరాఫ్
- అభివృద్ధి నిల్.. అసౌకర్యాలు ఫుల్..
- హామీలు అమలు చేయడంలో ఎమ్మెల్యే విఫలం
- జగన్ మాటలన్నీ నీటి మూటలే
- ఇలాంటి వ్యక్తికి మళ్లీ ఓటు ఎందుకు వేయాలంటున్న స్థానికులు

ఆదోని, ఏప్రిల్ 24:

ఆదోని చారిత్రక నగరం. రెండో ముంబైగా పేరు గడించింది. వాణిజ్య కేంద్రంగా విరాజిల్లింది. ఇదంతా గత చరిత్ర. వైసీపీ బారిన పడ్డాక ఆదోని కళ తప్పిపోయింది. అన్యాయంపాలైంది. పట్టణంలోని ప్రధాన మిల్లులు మూతపడ్డాయి. కార్మికులు వీధినపడ్డారు. రాయలసీమలోనే అతి పెద్ద వ్యవసాయ మార్కెట్ ఇప్పుడు అనాథలా మారింది. టీడీపీ హయాంలో సుభిక్షంగా ఉన్న ఆదోని వైసీపీ ఐదేళ్ల పాలనలో అధోగతిపాలైంది. ఇన్నేళ్లలో ఏమీ చేయకుండా వైసీపీ నాయకులు ఇప్పుడు ఓటర్లను ఆకర్షించేందుకే అనేక వంచన పనులకు పాల్పడుతున్నారు. ప్రజలకు ఇది అర్థమైంది. కుడి చేత్తో ఇచ్చి, ఎడమ చేత్తో లాక్కుంటున్నారంటూ బహిరంగంగానే విమర్శిస్తున్నారు. వంటగ్యాస్ నుండి కరెంట్ చార్జీలు, బస్సు చార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలు, ఇంటి పన్ను, నీటి పన్ను, చెత్త పన్ను వేసిన ఏకైక ముఖ్యమంత్రి ఎవరైనా ఉన్నారంటే.. అది ఒక్క జగన్మోహన్ రెడ్డి మాత్రమేనని స్థానికులు ఈసడించుకుంటున్నారు. స్థానిక వైసీపీ నాయకులు నియోజకవర్గంలో బకాసురుల మాదిరి పేదలను పీడిస్తున్నారు. ఎక్కడపడితే అక్కడ భూకబ్జాలకు పాల్పడుతున్నారు. రేషన్ బియ్యం మాఫియా, మట్కా, అక్రమ మద్యం, సెటిల్మెంట్లు, ఎర్రమట్టి, క్రికెట్ బెట్టింగ్, నాటుసారా, పేకట క్లబ్బులు.. ఒకటేమిటి? సకల అభ్యంతరకర మార్గాల్లో ఆస్తులు సంపాదించుకుంటున్నారని ప్రతిపక్ష నేతలు విమర్శిస్తున్నారు. ఆదోని ఓటర్లకు సాయిప్రసాద్ రెడ్డి లాంటి రౌడీ ఎమ్మెల్యే ఇంకా అవసరమా అని ఎన్డీఏ కూటమి అభ్యర్థి పార్థసారథి ప్రశ్నిస్తున్నారు. వైసీపీ నాయకులు మత కల్లోలాలు సృష్టిస్తూ ఓట్లు దండుకుంటున్నారని ఆరోపిస్తున్నారు.



ఆదోని ఓవర్ బ్రిడ్జి దుస్థితి

- ఆదోని పట్టణంలో 2.82 లక్షలకు పైగానే జనాభా ఉంది. 156 ఏళ్ల కిందటి మున్సిపాలిటీ, రోడ్డు మాత్రమే నేటికీ ఉన్నాయి.
- రోడ్డు విస్తరణకు 2022 జూన్ నెలలో జగనన్న విద్యాకానుక పంపిణీకి సీఎం జగన్ ఆదోనికి వచ్చారు. రోడ్డు వెడల్పుకు, ఆక్రమణల తొలగింపునకు తక్షణమే రూ.50 కోట్లు మంజూరు చేస్తున్నట్లు హామీ ఇచ్చారు. ఆ హామీ నేటికీ హామీగానే మిగిలిపోయింది.
- ఆదోనివాసుల చిరకాల స్వప్నం బైపాస్ నిర్మాణం. ప్రతి ఎన్నికల్లో వైసీపీ తాము అధికారంలోకి వస్తే బైపాస్ పూర్తి చేసి ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి హామీ ఇచ్చారు. నిధులు మంజూరు చేయకపోగా కేంద్రం 2021లో బైపాస్ నిర్మాణానికి జాతీయ రహదారి 164గా గుర్తించి రూ.210 కోట్లు మంజూరు చేసింది. మూడేళ్లు గడుస్తున్నా, కాలయాపన చేస్తూ ఎన్నికలు వస్తున్నాయని హడావుడిగా బైపాస్ నిర్మాణం ప్రారంభించారు. ఓవైపు బైపాస్ నిర్మాణం వల్ల భూమి కోల్పోతున్న బాధితులకు న్యాయం చేయకుండానే పనులు నడిపిస్తున్నారు.



దిబ్బనకల్లు గ్రామంలో ప్రధాన సీసీ రోడ్డు ఇది..

- ఈద్గా నిర్మాణం చేపడతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారుగాని నిధులు మంజూరు చేయలేదు. గత టీడీపీ ప్రభుత్వంలో మైనారిటీ విద్యార్థుల సంక్షేమం కోసం నిర్మించిన ఐటీఐ పాలిటెక్నిక్ బాలికల వృత్తి నైపుణ్య కళాశాల 90 శాతం పైగా నిర్మాణ పనులు పూర్తి చేశారు. కక్ష సాధింపు చర్యగా నేటికీ అది ప్రారంభానికి నోచుకోలేదు.
- 30 ఏళ్లుగా విద్యార్థి సంఘాలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల కోసం ఉద్యమాలు చేస్తునే ఉన్నాయి. గత టీడీపీ ప్రభుత్వం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు జీవో జారీ చేసింది. కళాశాల భవనాలను నిర్మించకుండా ఎన్నికలు వస్తున్నాయని హడావుడిగా డిగ్రీ కళాశాలను ప్రారంభించి అద్దె భవనంలో కొనసాగిస్తున్నారు. నేటికి విద్యార్థులకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎక్కడుందో తెలియని పరిస్థితి.
- జిల్లాల పునర్విభజనలో ఆదోని జిల్లాను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వం ఈ డిమాండ్‌ను పట్టించుకోలేదు. పశ్చిమ ప్రాంత ఆదోని, ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాలు కలిపి ఆదోని అభివృద్ధి అథారిటీ (అడ) ఏర్పాటు చేసింది. ఐఏఎస్ అధికారి ద్వారా ఏర్పాటు చేసిన కమిటీ ఇంతవరకు నిధులు మంజూరు చేయలేదు. నియోజకవర్గాల్లో శాశ్వత అభివృద్ధి పనులను ఇంతవరకు చేపట్టలేదు.
- తాము అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో టిడ్కో ఇళ్లు ఇస్తామని వైఎస్ జగన్ హామీ ఇచ్చారు. ఇంత వరకు పూర్తయిన ఇండ్ల తాళాలు లబ్ధిదారులకు ఇవ్వలేదు.
- గ్రామాల్లో వైసీపీ ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేయకపోగా, గ్రామ పంచాయతీలకు వచ్చే 14, 15వ ఆర్థిక సంఘం నిధులను కూడా ప్రభుత్వం తీసుకున్నది. దీంతో సర్పంచులు గ్రామాల్లో బ్లీచింగ్ పౌడర్ కూడా వేయలేకపోతున్నారు.
- ఆదోని పట్టణంలో తాగునీటి పరిస్థితి అధ్వానంగా ఉంది. ఆదోని తాగునీరు అందించే ఎస్ఎస్ ట్యాంక్ కుంగిపోవడంతో నీళ్లు నిలిపేశారు. దీంతో వారానికి ఒకసారి నీరు సరఫరా చేస్తున్నారు.

ఐదేళ్లలో ఆదోని అభివృద్ధి శూన్యం



వైసీపీ ప్రభుత్వం ఏర్పడి ఐదేళ్లయింది. ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి ఒక్క అభివృద్ధి పని చేయలేదు. కేంద్ర ప్రభుత్వ నిధులు, మున్సిపల్ నిధులతో కొంతవరకు పనులు చేశారు. వైసీపీ ప్రభుత్వం ద్వారా నిధులు రాక ఒక్క అభివృద్ధి పని కూడా చేయలేదు. ఎన్నికలు ముందు ఓటు కోసం హామీలు ఇచ్చారుగాని ఒక్క పనీ చేయలేదు. పట్టణంలో రోడ్ వెడల్పు చేస్తామని ఉత్తుత్తి హామీలు ఇచ్చారు. మరోసారి ఓటర్లను మోసం చేసేందుకు ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి వస్తున్నాడు. ఈసారి ప్రజలు అధికార పార్టీకి గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారు.

\- లక్ష్మణ్ణ, ఆదోనివాసి

భూకబ్జాలు, బెట్టింగులు తప్ప అభివృద్ధి శూన్యం



ఆదోని వైసీపీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి ఐదు సంవత్సరాల పాలనలో ఆదోని అభివృద్ధికి నోచుకోలేదు. అభివృద్ధి లేదని ప్రశ్నించిన వారిపై దాడులు చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉపాధి లేదు. పనులు లేక వలసలు వెళ్తున్నారు. భూకబ్జాలు, ఆక్రమణలు, క్రికెట్ బెట్టింగులు ప్రోత్సహించి ప్రజలను చిత్రహింసలకు గురిచేశారు. ఎమ్మెల్యే అనుచరులైతే ఎక్కడ ఖాళీ స్థలం కనబడినా కబ్జా చేసి దర్జాగా అనుభవిస్తున్నారు. గరుసు, ఇసుక, ఎర్రమట్టి తవ్వకాలు చేపట్టి సొమ్ము చేసుకున్నారు. ఆదోని డెవలప్‌మెంట్ అథారిటీకి నిధులు తేవడంలో సాయిప్రసాద్ రెడ్డి ఘోరంగా విఫలమయ్యారు. 15 ఏళ్లపాటు ఎమ్మెల్యేగా ఉండి ఆయన చేసిందేమి లేదు. ఇలాంటి ఎమ్మెల్యేను ప్రజలు ఇంటికి సాగనంపాలి.

\- మాదారి కురువ నాగరాజ్ గౌడ్, స్థానికుడు, ఆదోని



ఆదోనిలోని ఇందిరానగర్‌లో ఇలా..

గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య.

ఐదేళ్లుగా ఆదోని నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లినా తాగునీరు దొరకక అవస్థలు పడుతున్నారు. తాగునీటి సమస్య పరిష్కరిస్తామని వైసీపీ నాయకులు ఇచ్చిన హామీ ఇంతవరకు నెరవేరలేదు.

- ఆటోనగర్ నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చినా, ఇంతవరకు భూసేకరణ కూడా జరుగలేదు. పట్టణంలో వాహనదారులు దానిపై ఆధారపడిన మెకానిక్‌లు స్థలం దొరకక అవస్థలు పడుతున్నారు.



ఆదోనిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అద్దె భవనం



జాలిమంచి గ్రామంలో తాగునీటి అవస్థలు

ప్రభుత్వ నగదుకు పత్రాలు పకడ్బందీగా ఉండాలి

మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ జిల్లా నోడల్ అధికారి జి.నాసరరెడ్డి



జిల్లా పరిషత్‌లో విచారణ జరుపుతున్న గ్రీవెన్స్ కమిటీ సభ్యులు

కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 24: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ప్రభుత్వ నగదును తరలించడానికి పత్రాలు పకడ్బందీగా ఉండేలా చూసుకోవాలని మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ జిల్లా నోడల్ అధికారి జి. నాసరరెడ్డి అన్నారు. ఈ నెల 22న పెద్దతుంబళం వద్ద రాత్రి ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి ఆదోనికి తీసుకెళ్తున్న రూ.1,46,890ను దుకాణం సూపర్‌వైజర్ అనిల్‌కుమార్‌రెడ్డి నుంచి ఎస్ఎస్‌టీ సభ్యులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నగదు ప్రభుత్వానికి చెందినదని, తన వద్ద అన్ని రకాల పత్రాలు ఉన్నాయని అనిల్‌కుమార్ రెడ్డి ఆదోని రిటర్నింగ్ అధికారికి అప్పీల్ చేశారు. దీనిపై విచారణ జరపాని జిల్లా గ్రీవెన్స్ కమిటీని ఆదోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆదేశించారు. బుధవారం జిల్లా పరిషత్‌లో గ్రీవెన్స్ కమిటీ హెడ్ జి. నాసరరెడ్డి, కన్వీనర్ జిల్లా ఆడిట్ అధికారి కే. రమేష్‌బాబు, సభ్యులు డిప్యూటీ డైరెక్టర్ ట్రెజరీస్ బి. రామచంద్రరావు విచారించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఏఈఎస్ వాసుదేవ చౌదరి, సీఐ క్రిష్ణమోహన్, ఎస్ఐ ఎస్‌ఎం. ఫరూక్ నగదుకు తగిన పత్రాలు తీసుకుని వచ్చి గ్రీవెన్స్ కమిటీ సభ్యులకు అందజేశారు. దీంతో కమిటీ సభ్యులు నగదును విడుదల చేశారు.

మలేరియా కేసులు తగ్గాయి

కర్నూలు(హాస్పిటల్), ఏప్రిల్ 24: జిల్లాలో మలేరియా కేసులు బాగా తగ్గాయని డీఎంహెచ్‌వో వై.ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం పురస్కరించుకుని బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం డీఎంహెచ్‌వో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. 2024లో 1,32,943 మం దికి శ్యాంపిల్స్‌ను సేకరించగా అందులో దేవనకొండ మండలం కోటకొండలో ఓ వ్యక్తికి మలేరియా సోకిందని ఈ కేసు మినహా జిల్లాలో ఎక్కడా కేసులు వెలుగు చూడలేదన్నారు. జిల్లా మలే రియా అధికారి నూకరాజు మాట్లాడుతూ జిల్లాలో ప్రతి శుక్రవారం ఫ్రైడే-డ్రైడేను నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో అడిషినల్ డీఎంహెచ్‌వో భాస్కర్, అసిస్టెంట్ మలేరియా అధికారి చంద్రశేఖర్‌రావు, ఆర్‌బీఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్ హేమ లత, డీటీసీఎస్ డాక్టర్ సంధ్య, డెమో ప్రమీలాదేవి, ఎస్‌వో హేమసుందరం, డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

కోలాహలంగా నామినేషన్లు

- పాణ్యం, కోడుమూరు, పత్తికొండ టీడీపీ అభ్యర్థుల దాఖలు
- ఇప్పటి వరకు 172కు చేరిన నామినేషన్ పత్రాలు

కర్నూలు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కందనవోలు గడ్డపై పసుపు సైన్యం జోరు పెంచింది. బుధవారం కోడుమూరు, పాణ్యం, పత్తికొండ నియోజకవర్గాల్లో భారీ ఊరేగింపుతో టీడీపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వెల్లువలా తరలివచ్చిన తెలుగు తమ్ముళ్ల ఉత్సాహం.. కేరింతలతో నామినేషన్ల ఊరేగింపు సాగింది. 24వ తేదీ మంచి రోజు కావడంతో ఒక్కరోజే 63 నామినేషన్లు దాఖలయ్యాయి. 18వ తేదీ నుంచి ఇప్పటి దాకా కర్నూలు ఎంపీ సహా 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 172 నామినేషన్లు ఎన్నికల అధికారులకు చేరాయి. పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత నంద్యాల చెక్‌పోస్టు నుంచి కలెక్టరేట్ వరకు భారీ ఊరేగింపు నిర్వహించారు. ఆమెతో పాటు టీడీపీ నందికొట్కూరు ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, జనసేన కన్వీనర్ చింతామోహన్, బీజేపీ నాయకులు నాగరాజులు వెంట రాగా ఊరేగింపు ముందుకు సాగింది. అనంతరం నిబంధనల ప్రకారం పాణ్యం ఆర్వో, జేసీ నారపురెడ్డి మౌర్యకు నామినేషన్ పత్రాలు అందజేశారు.

- కోడుమూరు నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి సైతం భారీ ఎత్తున ఊరేగింపుగా ఆర్వో కార్యాలయం చేరుకుని నామినేషన్ దాఖలు చేశారు. టీడీపీ సీనియర్ నాయకులు ఎదురూరు విష్ణువర్దన్ రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గం నలుమూలల నుంచి వెల్లువలా తరలివచ్చిన తెలుగు తమ్ముళ్ల ఊరేగింపు ఎస్టీబీసీ కాలేజీ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు సాగింది. అభ్యర్థి బొగ్గుల దస్తగిరి వెంట టీడీపీ నాయకులు విష్ణువర్దన్ రెడ్డి, రామలింగారెడ్డి, కేఈ మల్లికార్జున గౌడు, కేఈ వేమన్నగౌడు, ఆకేపాటి జయన్నలతో పాటు సర్పంచులు, ఎంపీటీసీలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. టీడీపీ అభ్యర్థిగా దస్తగిరి ఆయన సతీమణి ముప్పసాని సుధారాణిలు ఆర్వో, ఆర్డీవో శేషిరెడ్డికి నామినేషన్ పత్రాలు అందజేశారు.
- పత్తికొండలో టీడీపీ అభ్యర్థి కేఈ శ్యాంబాబు భారీ ఊరేగింపు మధ్య నామినేషన్ వేశారు. ముందుగా తల్లిదండ్రులు మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి, పద్మావతమ్మల ఆశీర్వాదం తీసుకున్నారు. కర్నూలు ఎంపీ టీడీపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు, టీడీపీ సీనియర్ నాయకులు తుగ్గలి నాగేంద్ర, బత్తిన వెంకట్రాముడు, నబీసాబ్, కేఈ హరిబాబు తదితరులతో కలిసి ఎన్టీఆర్ సర్కిల్ నుంచి గుత్తి సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. వీధుల్లో ఎటు చూసినా పసుపు జెండాలు రెపరెపలాడాయి. రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో రామలక్ష్మికి నామినేషన్ పత్రాలు అందజేశారు. అలాగే ఆలూరు టీడీపీ అభ్యర్థి వీరభద్రగౌడు, మంత్రాలయం టీడీపీ అభ్యర్థి ఎన్.రాఘవేంద్రరెడ్డి, ఆదోని బీజేపీ అభ్యర్థి పార్థసారధిలతో పాటు కర్నూలు వైసీపీ ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య, కర్నూలు ఎమ్మెల్యే వైసీపీ అభ్యర్థి ఇంతియాజ్ బాషా తదితరులు నామినేషన్లు వేశారు.



నామినేషన్ వేస్తున్న గౌరు చరిత



నామినేషన్ వేస్తున్న బొగ్గుల దస్తగిరి



నామినేషన్ వేస్తున్న కేఈ శ్యాంబాబు

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల తనిఖీ

- పకడ్బందీగా విధులు నిర్వహించాలి
- ఎస్పీ కృష్ణకాంత్



సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఎస్పీ జి. కృష్ణకాంత్

వెల్దుర్తి, ఏప్రిల్, 24: సార్వత్రిక ఎన్నికలు సమీ పిస్తున్నందున ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా కర్నూలు జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ వెల్దుర్తి మండలంలో ఉన్న ఫ్యాక్షన్ గ్రామాల పికెట్‌లు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రా లను పరిశీలించారు. బుధవారం చెరుకు లపాడు, మల్లెపల్లె గ్రామాలలో పికెట్‌లు, పోలింగ్ కేంద్రా లను తనిఖీ చేశారు. అక్కడ భద్రత ఏర్పాట్లను సమీక్షించారు. గ్రామాలలో ప్రస్తుత మున్న పరిస్థితులు, స్థితిగతులను ఆరాతీశారు. పోలింగ్ సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘ టనలు జరగకుండా చేపట్టాల్సిన భద్రత చర్యల గురించి ఆరా తీశారు. మే 13న జరగబోయే సార్వత్రిక ఎన్నికలలో ప్రజలు ప్రశాంత వాతా వరణంలో ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీనివాసరెడ్డి, స్పెషల్ బ్రాంచ్ హెడ్‌కానిస్టేబుల్ ఖాజా, పోలీసులు పాల్గొన్నారు.

రేపు శ్రీశైలంలో కుంభోత్సవం

శ్రీశైలం, ఏప్రిల్ 24: శ్రీశైలంలో ఈ నెల 26న భ్రమరాంబకు కుంభోత్సవాన్ని నిర్వహించనున్నారు. గుమ్మడికాయలు, కొబ్బరికాయలు, నిమ్మకాయలు, అన్నపురాశి అమ్మవారికి సాత్వికబలిగా సమర్పించనున్నారు. ప్రతి సంవత్సరం చైత్రమాసంలో అమ్మవారికి సాత్వికబలి సమర్పించేందుకు పౌర్ణమి తరువాత వచ్చే మంగళవారం లేదా శుక్రవారం ఈ ఉత్సవాన్ని జరపడం ఆనవాయితీ. ఈ మేరకు శుక్రవారం కుంభోత్సవానికి ఏర్పాట్లు చేశారు.

ఓటమి ఎరుగని వీరుడు..

డోన్‌లో పోటీ చేసిన ప్రతిసారి గెలిచిన కేఈ కృష్ణమూర్తి



డోన్, ఏప్రిల్ 24: డోన్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటమి ఎరుగని వీరుడుగా కేఈ కృష్ణమూర్తికి పేరుంది. పోటీ చేసిన ప్రతి ఎన్నికల్లోనూ గెలిచిన రికార్డు ఆయన సొంతం. డోన్ అసెంబ్లీ నియోజకవర్గ రాజకీయాల్లో 1978 సంవత్సరంలో కేఈ మాదన్న వారసులుగా కేఈ కృష్ణమూర్తి అడుగు పెట్టారు. అప్పుడు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ (ఐ) అభ్యర్థిగా పోటీ చేసి మొదటిసారి ఎమ్మెల్యేగా కేఈ కృష్ణమూర్తి విజయం సాధించారు. మొదటిసారిగా ఎమ్మెల్యేగా గెలిచిన కేఈ పలు మంత్రి శాఖలకు లఘు పరిశ్రమలు, ఎక్సైజ్ శాఖ మంత్రిగా పని చేశారు. తర్వాత 1983లో జరిగిన ఎన్నికల్లో డోన్ అసెంబ్లీ నుంచి రెండోసారి కాంగ్రెస్ తరపున పోటీ చేసి కేఈ కృష్ణమూర్తి విజయం సాధించారు. ఆ తర్వాత 1985లో డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి కేఈ కృష్ణమూర్తి హ్యాట్రిక్ విజయాన్ని సాధించారు. ఎన్టీఆర్ క్యాబినెట్‌లో భారీ నీటి పారుదల శాఖ మంత్రిగా ఆయన పని చేశారు. మళ్లీ 1989లో కాంగ్రెస్ పార్టీ తరుపున డోన్ అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేసి కేఈ కృష్ణమూర్తి గెలుపొందారు. ఆ తర్వాత 2009 ఎన్నికల్లో డోన్ అసెంబ్లీ నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఐదో సారి కేఈ కృష్ణమూర్తి విజయం సాదించారు. ఇలా డోన్‌లో పోటీ చేసిన ప్రతి ఎన్నికల్లోనూ కేఈ కృష్ణమూర్తి ఓటమి అనేది లేకుండా విజయపతాకం ఎగురవేసి చరిత్రను సృష్టించారు.

రెండో ఈవీఎంను ఎప్పుడు వినియోగిస్తారంటే..

అభ్యర్థులు ఎక్కువైనప్పుడు



చాగలమర్రి/కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 24: అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఒక నియోజకవర్గంలో 16 మంది కంటే ఎక్కువ మంది అభ్యర్థులు పోటీలో ఉంటే రెండో ఈవీఎంను ఉపయోగిస్తారు. ఒక ఈవీఎంలో 16 మంది వివరాలు మాత్రమే రికార్డు చేసేందుకు వీలు ఉంటుంది. అంతకన్నా ఎక్కువ మంది బరిలో ఉంటే తప్పకుండా మరో ఈవీఎంను ఉపయోగించాలి. ఉదాహరణకు 18 మంది అభ్యర్థులు రంగంలో ఉంటే మొదటి ఈవీఎంలో 16 మంది అభ్యర్థుల వివరాలు, రెండో ఈవీఎంలో ఇద్దరి వివరాలు ఉంచుతారు. దీంతో పాటు ఏ పోలింగ్ కేంద్రంలో అయిన ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తరువాత మధ్యలో ఈవీఎం మొరాయిస్తే అప్పటి వరకు నమోదైన వివరాలు సీజ్ చేసి, రెండో ఈవీఎంను వినియోగిస్తారు.

1957 ఎన్నికల్లో అభ్యర్థికో బ్యాలెట్ బాక్సు


అప్పుడు అలా..!



చాగలమర్రి, ఏప్రిల్ 24: పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం, ఎన్నికల నిర్వహణ సులభతరం కోసం చట్టసభల ఎన్నికలకు ఎన్నికల కమిషన్ కొన్ని దఫాలుగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం)లను అందుబాటులోకి తెచ్చింది. అంతక ముందు బ్యాలెట్ పత్రం విధానంలో నిర్వహించిన ఎన్నికల్లో బ్యాలెట్ బాక్సులు ఉండేవి. అయితే అభ్యర్థులందరికీ కలిపి ఒకే బ్యాలెట్ ఉన్నట్లుగానే ఓటు వేసిన బ్యాలెట్ పత్రాలను పోలింగ్ బూతుల్లోని ఒకే బ్యాలెట్ బాక్సులో వేసేవారు. అయితే 1952, 1957లో నిర్వహించిన మొదటి, రెండు సార్వత్రిక ఎన్నికల్లో మాత్రం ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులకు సమానంగా పోలింగ్ బూత్‌లలో బ్యాలెట్ బాక్సులు ఉండేవి. దీంతో బ్యాలెట్ బాక్సుల తయారీ, రవాణా, భద్రపరచడం, ఓట్ల లెక్కింపుకు తదితర ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లు సంక్లిష్టంగా ఉండేవి. ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ సంస్కరణలు తేవడంతో 1962 ఎన్నికల నుంచి ఒకే బ్యాలెట్ బాక్సు విధానం అమలులోకి వచ్చింది.

భారత తొలి రాష్ట్రపతి నంద్యాలకు వచ్చిన వేళ..

జ్ఞాపకం



బాబు రాజేంద్రప్రసాద్‌కు స్వాగతం పలుకుతున్న దృశ్యం (ఫైల్)

నంద్యాల టౌన్, ఏప్రిల్ 24 : భారత దేశ మొట్టమొదటి రాష్ట్రపతి, క్రమశిక్షణకు, దృఢ నిర్ణయాలకు తనకు తానే సాటి అనిపించుకున్న డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్ అధికారిక హోదాలో 1952లో నంద్యాలలో పర్యటించారు. బళ్లారి నుంచి రైలు మార్గం ద్వారా బొగ్గు రైలులో రాష్ట్రపతిగా నంద్యాలకు విచ్చేసిన బాబు రాజేంద్రప్రసాద్‌కు అప్పటి సీనియర్ కాంగ్రెస్ నాయకులకు ఎంతో ఆప్తుడైన కాదరబాద్ నరసింగరావు స్వాగతం పలికారు. రాష్ట్రపతికంటే ముందు ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ నంద్యాలకు వచ్చి నరసింగరావు చేపట్టిన హరిజనోద్ధరణ, పేద విద్యార్థులు, రైతుల కోసం చేసిన కృషిని తానే స్వయంగా బాబు రాజేంద్రప్రసాద్‌కు వివరించడంతో ఆయన అప్పట్లో నంద్యాలకు వచ్చారు. అంతకు మునుపు 1937లో నరసింగరావు ఆధ్వర్యంలోనే నిర్వహించిన ప్రొవిన్షియల్ కాంగ్రెస్ మహాసభలు నిర్వహించినప్పుడు సీ రాజగోపాలాచారి వంటి ఎందరో రాజకీయ మదరాసు నాయకులు రాగా, ఆ సమావేశానికి తాను కూడా హాజరైన విషయాన్ని రాష్ట్రపతి హోదాలో బాబు రాజేంద్రప్రసాద్ ప్రజల ముందు గుర్తు చేయడం నంద్యాల ఖ్యాతి అప్పట్లో దేశస్థాయిలో ఎలా ఉండేదో ఇప్పటికీ కళ్ల ముందు కదలాడుతోంది.

ప్రలోభపెడితే.. చర్యలు తప్పవు!



శిరివెళ్ల, ఏప్రిల్ 24: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల సమరం జోరందుకుంది. అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎలాగైనా గెలవాలన్న పట్టుదలతో ప్రచారం ముమ్మరం చేశారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న తరుణంలో ఓటర్లకు తాయిలాలు ఇవ్వాలని చూసినా మద్యం, నగదు పంపిణీతో పాటు నిషేధిత ప్రదేశాల్లో సమావేశాలు ఏర్పాటు చేసినా ఎన్నికల సంఘం తీవ్ర నేరంగా పరిగణిస్తుంది. వీటన్నింటిని పరిశీలించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక బృందాలతో నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసింది. నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తిస్తే ప్రజాప్రాతినిధ్య చట్టం 1951, భారత శిక్షాస్మృతి లోని సెక్షన్ 171లో ఉన్న పలు సబ్‌క్లాజ్‌ల కింద కేసులు నమోదు చేస్తారు. నేరం రుజువైతే జరిమానా, శిక్ష లేదా రెండింటికి గురయ్యే ప్రమాదం ఉంది. ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను ప్రభావితం చేస్తే.. కేసులు, శిక్షలు ఎలా నమోదవుతాయో తెలుసుకుందాం.

ఐపీసీ సెక్షన్ 171లోని సబ్‌క్లాజ్‌ల కింద కేసుల నమోదు



● మద్యం సరఫరా చేస్తే :



రాజకీయ పార్టీల నాయకులు ప్రచారం ప్రారంభించినప్పటి నుంచి ఎన్నికలు ముగిసేంత వరకు కార్యకర్తలు, ప్రజలకు మద్యం పంపిణీ చేస్తుంటారు. ప్రస్తుతం ఓ వ్యక్తి మూడు మద్యం సీసాలు తీసుకెళ్లేందుకు మాత్రమే అనుమతులున్నాయి. కానీ ఎన్నికల తరుణం కావడంతో మద్యం దుకాణాల నుంచి, ఇతర ప్రాంతాల నుంచి మద్యం భారీగా తరలిస్తుంటారు. అలా అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుపడితే 'ఎక్సైజ్ యాక్ట్ 1968 సెక్షన్ 34-ఏ' ప్రకారం కేసు నమోదు చేస్తారు. ఆరు నెలల నుంచి ఏడాది వరకు శిక్ష, రూ.5 వేలు నుంచి రూ20 వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది.

ఎన్నికలంటే డబ్బే.. డబ్బు



అధికారులకు లంచం రూపంలో డబ్బులు ఇచ్చినా.. ఓటర్లకు డబ్బులు పంచినా ఐపీసీ-171-బీ కింద కేసు నమోదు చేస్తారు. భారీగా నగదు అక్రమ చెల్లింపులు చేస్తే ఐపీసీ 171-హెచ్ కింద చర్యలు తీసుకుంటారు.

● ఖర్చుల వివరాలు తప్పనిసరి



ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు తమ ఎన్నికల వ్యయానికి సంబంధించిన వివరాలను ఎన్నికలు ముగిసిన నెలలోపు ఎన్నికల సంఘానికి తప్పనిసరిగా అందించాలి. ఎన్నికల ఖర్చుకు సంబంధించి అభ్యర్థులు ప్రత్యేక ఖాతా తెరవాల్సి ఉంటుంది. నిబంధనలు ఉల్లంఘిస్తే ఐపీసీ సెక్షన్ 171-ఐ కింద కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటారు.

● ఓటర్లను బెదిరింపులకు గురిచేస్తే..



ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి. ప్రజాప్రతినిధులను ఎన్నుకునేందుకు కీలకమైన ఓటర్లను బెదిరించడం, ఒత్తిడికి గురి చేయడం నేరం. ఇలా చేసినట్లు రుజువైతే వారిపై 'ఐపీసీ సెక్షన్ 171-సీ' చట్టం కింద కేసు నమోదు చేస్తారు.



● రెచ్చగొట్టేలా వ్యవహరిస్తే..

ఓట్ల కోసం కులం, మతం, సామాజిక వర్గాలను రెచ్చగొట్టేలా, కించపరిచేలా కొందరు వ్యాఖ్యలు చేస్తుంటారు. ఇతరుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించడం, ప్రాంతీయ కులం, మతం వారీగా వేరు చేసి ప్రలోభపెట్టేలా హామీలు ఇవ్వడం చేస్తే ప్రజాప్రాతినిధ్య చట్టం 1951సెక్షన్ 125, ఐపీసీ సెక్షన్ 171-డీ కింద కేసులు నమోదు చేస్తారు.

● ప్రచార సమయం మీరినా ప్రమాదమే

కేంద్ర ఎన్నికల సంఘం అభ్యర్థులకు కేటాయించిన సమయం వరకు మాత్రమే ప్రచారాలు చేసుకోవాలి. నిబంధనలు అతిక్రమించి భారీ మైక్‌సెట్లు, డీజేలు వినియోగించకూడదు. వీటిని ఉల్లంఘిస్తే ఐపీసీ 171-ఎఫ్ కింద చర్యలు చేపడతారు.



● అసత్య ఆరోపణలు చేస్తే..

ఎన్నికల ప్రచారంలో భాగంగా ఓటర్లను ఆకర్షించేందుకు లేనిది ఉన్నట్లు అసత్య ప్రచారం, ఆరోపణలు, తప్పుడు ప్రకటనలు చేస్తుంటారు. అలాంటి సమయంలో ప్రత్యర్థులు ఫిర్యాదు చేసే అవకాశం ఉంది. దీంతో బాధ్యులపై ఐపీసీ 171-జీ కింద కేసు నమోదు చేస్తారు.

కానుకలు పంపిణీ చేయడం నేరం

ఓటర్లను ప్రలోభపెట్టడంలో భాగంగా వారికి కానుకలు పంపిణీ చేయడం చట్టరీత్యా నేరం. ఎన్నికల్లో గెలుపొందేందుకు అభ్యర్థులు తమ పరిధిలోని మహిళా ఓటర్లకు చీరలు, బంగారు ముక్కుపుడకలు, వెండి వస్తువులు, గృహోపకరణ సామగ్రి తదితర వాటిని పంచుతుంటారు. పురుష ఓటర్లకు విందులు, వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేస్తుంటారు. ఓటర్లను నేరుగా ప్రలోభాలకు గురి చేయాలని చూస్తే ఐపీసీ 171-ఈ ప్రకారం కేసులు నమోదు చేస్తారు.



కండువా కప్పుకుంటే రూ.200



నందికొట్కూరు, ఏప్రిల్ 24: ఎన్నికల సమయంలో నాయకులు పార్టీలు మారుతుండటం సహజం. అటువంటి వారు తమ బలాన్ని, బలగాన్ని చూపించుకోవడానికి కూలీలను ఉపయోగించుకుంటున్నారు. పార్టీలు మారే క్రమంలో తమ వెంట కూలీలను తీసుకెళ్తున్నారు. అయితే ఇతరుల పార్టీల వారికి కూడా వీరే వెళ్తున్నారు. ఇలా చేయడం వల్ల వారు ఇచ్చే రూ.200 చేతి ఖర్చులకు వస్తాయన్న భావన కూలీల్లో నెలకొంది. ఎన్నికల ప్రచారానికి వస్తున్న నేపథ్యంలో తమ కుటుంబ సభ్యుల పేర్లను రాయించుకుని అభ్యర్థి రాగానే ప్రచారంలో కండువా కప్పుకుని జెండా చేతపట్టుకుని తిరుగుతున్నారు. ఇక కొంత మంది నాయకులు తమ కుటుంబ సభ్యుల పేర్లను, బంధువుల పేర్లను పెట్టి డబ్బులు జేబుల్లో వేసుకుంటున్నారు. అయితే ఓటరు దేవుడి మనస్సులో ఏముందో అర్థం కాని పరిస్థితి.

ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆస్తులివే..

కామ్మో ఇన్ని కోట్లా..

బనగానపల్లె, ఏప్రిల్ 24: బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ఆస్తుల వివరాలను అఫిడవిట్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి కామేశ్వరరావుకు సమర్పించారు. కాటసాని రామిరెడ్డి స్థిర ఆస్తులు రూ.16, 41,70,000, ఆయన భార్య జయమ్మ పేరు మీద రూ.18.90 కోట్లు, కాటసాని రామిరెడ్డి చరాస్థులు 1.90కోట్లు, కాటసాని జయమ్మ చరాస్థులు రూ. 3.77 కోట్లు ఉన్నట్లు చూపారు. కాటసాని రామిరెడ్డి అప్పులు రూ.2,52,65,434లు, కాటసాని జయమ్మ అప్పులు రూ2,58,15,705 ఉన్నట్లు చూపారు.



ఎంపీ పోచా ఆస్తులు రూ.147.74 కోట్లు

● అప్పులు రూ.54.37 కోట్లు

నంద్యాల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి ఆస్తుల విలువ దాదాపు రూ.147 కోట్లకు పైగానే ఉందని ఆయన ఎన్నికల అధికారులకు బుధవారం సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. దీని ప్రకారం ఆయన పేరిట చరాస్తులు రూ.50,19,35,355, ఆయన భార్య పోచా రామపుల్లమ్మ పేరిట రూ.21,20,43,092, ఇక ఉమ్మడిగా రూ.57,45,31,623 ఉన్నట్లుగా పేర్కొన్నారు. ఇక స్థిరాస్తుల రూపంలో పోచా బ్రహ్మానందరెడ్డి పేరిట రూ.28,59,39,000, ఆయన భార్య పేరిట రూ.16,11,17,000, ఉమ్మడిగా రూ.25,89,87,000 విలువ చేసే ఆస్తులు ఉన్నాయి. పోచా, ఆయన భార్య, ఉమ్మడి స్థిర, చరాస్తులు విలువ రూ.147.74 కోట్లుగా చూపించారు. ఇక ఆయన అప్పులు గురించి చూస్తే పోచా బ్రహ్మానందరెడ్డి పేరిట రూ.32,25,13,224 ఉండగా, ఆయన భార్య పేరిట రూ.11.89 కోట్లు చూపించారు. ఇద్దరికీ కలిపి మొత్తం అప్పులు రూ.54.37 కోట్లుగా అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

హ్యాట్రిక్ వీరులు

● భూమా నాగిరెడ్డి, ఎస్పీవైరెడ్డిలదే ఆ ఘనత







నంద్యాల టౌన్, ఏప్రిల్ 24 : ఉమ్మడి జిల్లాలో ఎంపీలు హ్యాట్రిక్ సాధించిన ఘనత ఆ ఇద్దరికే దక్కుతుంది. భూమా నాగిరెడ్డి, ఎస్పీవై రెడ్డిలు వరుసగా మూడు సార్లు విజయం సాధించి హ్యాట్రిక్ సాధించారు. దేశ ప్రధాని హోదాలో పీవీ నరసింహారావు 1991లో జరిగిన ఉప ఎన్నికల్లో నంద్యాల ఎంపీగా పోటీ చేసి విజయం సాధించారు. అలాగే 1996లో పీవీ రెండోసారి పోటీ చేసి విజయం సాధించడం, అదే సమయంలో ఒడిస్సాలోని బరంపురం నుంచి కూడా పోటీ గెలిచారు. దీంతో నంద్యాల స్థానానికి రాజీనామా చేయడంతో 1996లోనే ఉప ఎన్నిక జరిగింది. అంతకు మునుపు జరిగిన ఎన్నికల్లో ప్రధాని పీవీపైన పోటీ చేసి గట్టిపోటీ ఇచ్చి 5.80 లక్షల మెజార్టీని లక్ష ఓట్ల మెజార్టీకి తగ్గించడంలో యువనేతగా టీడీపీ అభ్యర్థి భూమా నాగిరెడ్డి సంచలనం లేపారు. దీంతో ఉప ఎన్నికలో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన భూమా నాగిరెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి పీవీ రంగయ్య నాయుడుపై విజయం సాధించి మొదటిసారి లోక్‌సభకు ఎన్నికయ్యారు. 1998లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గంగుల ప్రతాపరెడ్డిపై భూమా నాగిరెడ్డి పోటీ చేసి రెండోసారి ఎంపీగా గెలుపొందారు. 1999లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గంగుల ప్రతాపరెడ్డిపైనే టీడీపీ అభ్యర్థి భూమా నాగిరెడ్డి పోటీ చేసి గెలుపొందడంతో వరుస విజయాలతో హ్యాట్రిక్ ఎంపీగా రికార్డుల్లోకి ఎక్కారు. ఈ నేపథ్యంలోనే 2004లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి భూమా శోభా నాగిరెడ్డిపై కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన ఎస్పీవై రెడ్డి గెలిచి మొదటిసారి ఎంపీగా లోక్‌సభలో అడుగుపెట్టారు. 2009లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్‌పై కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన ఎస్పీవై రెడ్డి విజయం సాధించి రెండోసారి ఎంపీగా ఎన్నికయ్యారు. 2014 ఎన్నికల్లో కూడా టీడీపీ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్‌పై వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఎస్పీవైరెడ్డి గెలుపొందడంతో వరుస విజయాలతో హ్యాట్రిక్ సాధించిన రెండో ఎంపీగా రాజకీయాల్లో ఘనత సాధించారు. ఎందరో రాజకీయ ఉద్దండులు జిల్లా నుంచి ఎంపీలుగా గెలుపొందినప్పటికీ హ్యాట్రిక్ ఎంపీలుగా కర్నూలు పార్లమెంట్ నుంచి ఎవరూ లేకపోవడం, నంద్యాల పార్లమెంట్ నుంచి భూమా నాగిరెడ్డి, ఎస్పీవైరెడ్డిలు ఎంపీలుగా గెలువడంతో వీరిద్దరి ప్రాముఖ్యత రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.



మది నిండా టీడీపీ జెండా

టీడీపీకి అతను వీరాభిమాని. తెలుగుదేశం పార్టీ కార్యక్రమం ఎక్కడ జరిగినా అక్కడికి చేరుకుంటాడు. తనకున్న సైకిల్ నిండా టీడీపీ జెండాలను కట్టుకొని ప్రదర్శన కార్యక్రమం చేపడతాడు. గంగావతి నగర్ కల్లూరు ఎస్టేట్ వాసి శీర్వటి వీరాంజనేయులు 20 ఏళ్లు తెలుగుదేశం పార్టీ వెంటే నడుస్తున్నాడు. పార్టీ అంటే అంతులేని అభిమానం చూపుతుంటాడు. ఇందులోభాగంగానే బుధవారం తెలుగుదేశం పార్టీ పాణ్యం అభ్యర్థి గౌరు చరితారెడ్డి నామినేషన్ కార్యక్రమంలో ప్రత్యక్షమయ్యాడు. ఆమెకు మద్దతుగా టీడీపీ జెండాలతో సైకిల్‌పై ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. ఈ సందర్భంగా అతను మాట్లాడుతూ నందమూరి తారక రామారావు తనకు అభిమాన నటుడు అని, అందుకే తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల తరపున ప్రచారం చేస్తుంటానని చెబుతున్నాడు.

నామినేషన్ ఉందని ఉపాధి పనులు బంద్..?



రుద్రవరం, ఏప్రిల్ 24 : రుద్రవరం మండలంలోని లింగందిన్నె గ్రామంలో అధికార పార్టీ అభ్యర్థి నామినేషన్ ఉన్నందున బుధవారం ఉపాధి హామీ పనులు బంద్ చేశారు. గ్రామంలో సుమారు 400 మంది ఉపాధి కూలీలు పని చేస్తున్నారు. పనులు కల్పించకుండా నిలిపివేయడం నిరుపేద కూలీల కడుపు కొట్టినట్లే కదా అన్న విమర్శలు ఉన్నాయి.

టిఫిన్ పెట్టే వాళ్లు



ఎమ్మిగనూరు: ఇప్పటి వరకు ఎనిమిది సార్లు ఓటు వేశాను. ఓటు వేసేందుకు వెళ్లే సమయంలో ఓటర్లకు ఉగ్గాని పెట్టేవారు. ఓటు వేయాలి ఉగ్గాని తిని ఇంటికి వెళ్లాలనే విధంగా ఉండేది. డబ్బు గురించి ఎవరూ పట్టించుకునే వారు కాదు. డబ్బు ప్రభావం కనిపించేది కాదు. పోలింగ్ బూత్‌లో ఎన్నికల ఏజంటుగా కూర్చుంటే రూ.200 ఇచ్చేవారు తప్పితే.. ఓటు వేసేందుకు ఒక్క రుపాయి ఇచ్చేవారు కాదు. సోమప్ప, శివన్న వాళ్ల మీటింగ్ పెట్టి చెపితే ఆ ప్రకారంగా నడుచుకునే వాళ్లం.

- ఈరన్న, ఎమ్మిగనూరు

నోటుకు ఓటు చేటు



బండిఆత్మకూరు, ఏప్రిల్ 24: నా వయస్సు 19 సంవత్సరాలు. నేను బీకాం చదువుతున్నా. గత ఏడాది ఓటు నమోదు చేసుకున్నా. మే నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోనున్నాను. నేను వేసే ఓటు చెడుపై ఆయుధం అవుతుంది. నోటుకు అమ్ముడుపోతే ప్రజాస్వామ్యం అపహాస్యమై అది సమాజ మనుగడకు చేటుగా పరిణమిస్తుంది. రాజ్యాంగం కల్పించిన ఓటును ఎవరికీ అమ్ముకోకూడదు. యువత మంచి వారికి ఓటు వేసి ఎన్నుకోవాలి.

- అర్లగడ్డ మారుతి యుగంధర్, పెద్దదేవళాపురం

మంచి పరిపాలన అందించే నాయకునికే నా ఓటు



మహానంది, ఏప్రిల్ 24 : ప్రజల కష్టాలు తెలుసుకొని తీర్చే నాయకునికే ఓటు వేస్తాను. ఐదేళ్లపాటు సమర్థవంతంగా పరిపాలించే నాయకున్ని ఎన్నుకునే వారికే నా ఓటు. నాయకులు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చే హామీల్లో గెలిచిన తర్వాత 50 శాతం అమలు చేసినా రాష్ట్రం స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మారుతుంది. ఉచిత పథకాల మంత్రం వల్ల జనాలు సోంబేరులు అవుతున్నారు. అలాంటి నాయకులకు వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం ఓటుతో చెప్పాలి. పరిశ్రమలను నెలకొల్పి నిరుద్యోగ సమస్య తీర్చే నాయకునికే ఓటు వేయాలి.

- కాటంరెడ్డి ప్రసాదరెడ్డి, గోపవరం, మహానంది మండలం

తొలిసారిగా ఓటు వేయబోతున్నా



కోడుమూరు (రూరల్), ఏప్రిల్ 24: తొలిసారిగా ఓటు వేయబోతున్నా. మంచి పాలనను ఎంచుకోవడానికి ఓటే మార్గమని చదువుకున్నాం. యువత చైతన్యమైతే.. వెనుకటి, ముందు తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలవచ్చు.

- చెన్నకేశవులు, నూతన ఓటరు, వర్కూరు

అమరావతి అభివృద్ధికే..




రుద్రవరం, ఏప్రిల్ 24 : అమరావతి అభివృద్ధికే ఓటు వేస్తాం. ఒక రాజధాని ముద్దు, మూడు రాజధానులు వద్దు. ఆళ్లగడ్డ అభివృద్ధికే ఓటు వేస్తాం, డీఎస్సీ అన్నారు. డీఎస్సీ ఎక్కడ? మద్యపాన నిషేధం అన్నారు. ఐదేళ్లుగా ఆ ఊసే లేదు. మద్యం కిక్కులో పల్లెలు ఉన్నాయి.

- ప్రమీలమ్మ, రుద్రవరం



నీడలా నీవెంటే!

- రంగంలోకి తనిఖీ బృందాలు
- అభ్యర్థుల ఖర్చులు, నియమావళిపై ఆరా



కర్నూలు, ఏప్రిల్ 24: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల ఘట్టం ప్రారంభమైంది. పలానా రాజకీయ పార్టీ నేతలు ఇప్పటికే నామినేషన్లు మొదలు పెట్టారు. ఎన్నికల ప్రక్రియ ప్రధాన ఘట్టానికి చేరుకుంది. మరో నాలుగు రోజుల్లో నామినేషన్ ఘట్టం ముగుస్తుంది. ఆయా పార్టీల అభ్యర్థులు తమ గెలుపు కోసం సర్వం సిద్ధమయ్యారు. ఈ సారి గట్టి పోటీ ఉండడంతో అభ్యర్థులు పెద్ద ఎత్తున ఖర్చు పెట్టబోతున్నట్లు సమాచారం. మరో వైపు పార్టీ అధినేతలు పార్టీ ఫండ్ కింద పెద్ద మొత్తంలో ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఒక్క నియోజకవర్గానికి అభ్యర్థి ఖర్చు రూ.30 కోట్ల పైమాటే ఉన్నట్లు చర్చ జరుగుతోంది. నీడలా వెంటాడేందుకు ఎన్నికల కమిషన్ ప్రత్యేకంగా స్క్వాడ్‌లను నియమించింది. అయితే అభ్యర్థుల ఖర్చుపై నిఘా బృందం ఎప్పటికప్పుడు ఆరా తీస్తోంది.

రంగంలో ఏడు బృందాలు

ఫ్లయింగ్ స్క్వాడ్ (ఎఫ్ఎస్): ఈ బృందంలో ఒక గెజిటెడ్ అధికారి, ముగ్గురు కానిస్టేబుళ్లు, ఒక వీడియోగ్రాఫర్ ఉంటారు. ఒక్కో బృందంలోని సభ్యులంతా తనిఖీలు నిర్వహిస్తుంటారు. ఎక్కడైతే డబ్బు, మద్యం పంచుతున్నట్లు సమాచారం వచ్చిందో.. ఈ బృందం అక్కడకు వెళ్లి వాటిని నియంత్రిస్తుంది. రోజువారి వివరాలను సంబంధిత ఆర్వోకు పంపిస్తారు.

స్టాటిక్ సర్వేలియన్స్ బృందం (ఎస్ఎస్‌టీ)

ఈ బృందం చెక్‌పోస్టుల్లో ఉంటూ వచ్చి పోయే వాహనాలను తనిఖీలు చేస్తుంది. డబ్బులు, మద్యం, ఇతర విలువైన వస్తువులు అక్రమంగా తరలిస్తుంటే.. వాటిని స్వాధీనం చేసుకుంటుంది. ప్రతి రోజూ ఆర్వోకు లెక్కలు చెప్పాలి. ప్రతి తనిఖీని వీడియో చిత్రీకరించాలి. ఏమైనా తరలించినా రశీదులు, ఆధారాలు ఈ బృందానికి చూపాల్సిందే..

కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ)

ఈ బృందంలో పలువురు అధికారులు, కానిస్టేబుళ్లు, వీడియోగ్రాఫర్లు ఉంటారు. అభ్యర్థులు ప్రచార రథాలు, వారి ఎన్నికల వ్యవహారాలు, ఇతర జమా ఖర్చులను సేకరించి నిఘా పెడతారు. ఎవరైనా అభ్యర్థులు ఎన్నికల నియామవళిని ఉల్లంఘిస్తున్నారో గమనిస్తుంటారు.

వీడియో సర్వేలియన్స్ బృందం (వీఎస్‌టీ)

ఈ బృందం అభ్యర్థుల సమావేశాలు, సభలు, ర్యాలీలపై దృష్టి సారిస్తారు. ఆ సభల్లో అభ్యర్థుల ప్రవర్తనా నియమావళిని గమనిస్తుంటారు.

● అకౌంటింగ్ బృందం (ఏటీ)

ఈ బృందంలోని అధికారులు అభ్యర్థుల జమా ఖర్చులు లెక్క పెడుతుంటారు. అభ్యర్థి ప్రచారానికి ఎంత ఖర్చు చేస్తున్నాడు.. అభ్యర్థుల ప్రచారాలకు వచ్చే కార్యకర్తలకు పెట్టే భోజనాలు, ఇతర ఖర్చులు, వాహనాల డీజిల్, బాడుగ లాంటి ఖర్చులు లెక్కకట్టి వాటిని రిటర్నింగ్ అధికారికి పంపిస్తారు. ఏ అభ్యర్థి అయినా.. ఎన్నికల నియమావళికి సంబంధించిన ఖర్చులు దాటారో వారిపై ఉల్లంఘనల కేసులు నమోదు చేస్తారు.

● వీడియో వీక్షక బృందం (వీవీటీ)

ఈ బృందంలోని అధికారులు సర్వేలియన్స్ టీమ్ నుంచి వచ్చిన వీడియోలను నిశితంగా పరిశీలిస్తుంటారు. నియామవళి ఉల్లంఘనలకు సంబంధించిన విషయాలపై నిఘా పెడతారు. నియామవళి ఉల్లంఘిస్తే.. ఈ బృందం కఠిన చర్యలు తీసుకుంటుంది.





మంత్రాలయం వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు

నియోజకవర్గాల వారిగా గమనిస్తే..

నియోజకవర్గం	ఎస్‌వోలు	ఎంసీసీ	ఎఫ్ఎస్‌టీ	ఎస్ఎస్‌టీ	వీఎస్‌టీ	వీవీటీ	ఏటీ	ఏఈవోలు
కర్నూలు	21	3	6	9	1	1	1	2
పాణ్యం	32	5	8	12	4	1	1	1
పత్తికొండ	27	5	10	9	1	1	1	2
కోడుమూరు	25	5	8	12	1	1	1	1
ఎమ్మిగనూరు	29	4	8	9	1	1	1	1
మంత్రాలయం	24	4	8	9	1	1	1	1
ఆదోని	26	3	6	9	1	1	1	2
ఆలూరు	29	6	10	9	1	1	1	1

● వీరిపైన ఎస్‌వోలు, ఏఈవోలు బృందాలుగా ఉంటారు. కర్నూలు జిల్లాలో మొత్తం 213 ఎస్‌వోలు, 35 ఎంసీసీ బృందాలు, 64 ఎఫ్ఎస్‌టీ బృందాలు, 78 ఎస్ఎస్‌టీ బృందాలు, 11 వీఎస్టీ టీములు, 10 వీవీటీ టీములు, 9 అకౌంటింగ్ టీములతోపాటు 12 మంది ఏఈవోలు ఉన్నారు.

ఎన్నికల ప్రక్రియలో అధికారులే కీలకం

● ఓటరు నమోదు నుంచి పోలింగ్ వరకు..



కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 24: ఎన్నికల నిర్వహణలో అధికారుల పాత్ర చాలా కీలకం. అంతకుముందు వరకు ప్రభుత్వ ఆధీనంలో ఉండే అధికారులు ఒకసారి ఎన్నికల షెడ్యూల్ విడుదల అయిందంటే.. వెంటనే ఎన్నికల సంఘం పరిధిలోకి వెళ్లిపోతారు. ఓటరు నమోదు నుంచి మొదలు పెడితే.. ఎన్నికల ప్రక్రియ పోలింగ్, లెక్కింపు ఇలా అన్ని బాధ్యతలు వారివే.. వివిధ స్థాయిలో వారి వారి విధులను నిబద్ధతతో పూర్తి చేస్తారు.

జిల్లా ఎన్నికల అధికారి: జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణ అంతా వారి పర్యవేక్షణలో జరుగుతుంది. అధికారులకు విధులు కేటాయింపు మొదలుకుని వారికి శిక్షణ కార్యక్రమాలను పర్యవేక్షిస్తారు. ఓటరు జాబితా తయారీ నుంచి ఓట్ల లెక్కింపు వరకు కలెక్టర్ ప్రధాన బాధ్యత వహిస్తారు.

రిటర్నింగ్ అధికారి (ఆర్వో): ప్రతి నియోజకవర్గానికి ఒక రిటర్నింగ్ అధికారిని ఎన్నికల సంఘం నియమిస్తుంది. ఆర్వో తమ పరిధిలోని ఎన్నికల ప్రక్రియలను పర్యవేక్షిస్తారు. నామినేషన్ల స్వీకరణ నుంచి పరిశీలన, తిరస్కరణ అభ్యర్థుల తుది జాబితా ప్రకటన, సిబ్బంది నియామకం, వారికి శిక్షణతో పాటు ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడి వరకు ఆర్వోదే బాధ్యత.

సెక్టోరియల్ అధికారి(ఎస్ఓ): పోలింగ్ కేంద్రాలలో సదుపాయాలు కల్పించే బాధ్యత సెక్టోరియల్ అధికారిపై ఉంటుంది. ర్యాంపుల ఏర్పాటు, విద్యుత్, తాగునీరు, మౌలిక సదుపాయాలు కల్పించే విదంగా చూస్తారు. ఒక సెక్టోరియల్ అధికారికి ఆరు పోలింగ్ కేంద్రాలు ఉంటాయి. పోలింగ్ కేంద్రంతో పాటు పరిసరాలలో ప్రశాంత వాతావరణం ఉండేలా చూడాలి. పోలింగ్ సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వారిదే బాధ్యత.

ప్రిసైడింగ్ అధికారి(పీఓ): ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒకప్ర ప్రిసైడింగ్ అధికారి ఉంటారు. పోలింగ్‌కు అవసరమైన ఈవీఎం ఇతర సామగ్రిని తీసుకువస్తారు. ఆయనకు కేటాయించిన పోలింగ్ కేంద్రం పూర్తి బాధ్యత ఆయనపై ఉంటుంది. ఓటింగ్ ముగిసిన తర్వాత ఈవీఎంలను బందోబస్తు నడుమ స్ట్రాంగ్ రూమ్‌కు తరలిస్తారు. ప్రిసైడింగ్ అధికారికి సహాయంగా అడిషనల్ ప్రిసైడింగ్ అధికారి కూడా ఉంటారు. వీరితో పాటు ముగ్గురు పోలింగ్ అధికారులు ఉంటారు. పోలింగ్ ప్రారంభానికి ముందే ఈవీఎంలు పని చేస్తున్నాయా..? లేదా..? ప్రిసైడింగ్ అధికారి చూడాల్సి ఉంటుంది.

పూల వ్యాపారులకు భలే గిరాకీ

- నాడు పూలదండలైతే.. నేడు అన్నీ గజమాలలే..
- ఒక్కోటి రూ.20 వేల నుంచి రూ.30 వేలు
- కొరిడి అభిమానం.. కీరిడి వ్యాపారం



గోనెగండ్ల, ఏప్రిల్ 23: సార్వత్రిక ఎన్నికల్లో పూల వ్యాపారులకు భలే గిరాకీ ఉంది. వేల రూపాయల్లోనే వ్యాపారం జరుగుతోంది. ఒక్క గజమాల రూ. 20వేల నుంచి రూ. 30 వేల వరకు ధర పలుకుతోంది. పోటీ చేసిన అభ్యర్థులు గ్రామానికి వచ్చారంటే ఆయా గ్రామాల నాయకులు తప్పనిసరిగా తమ నేతకు గజమాల వేస్తున్నారు. దీంతో వ్యాపారులకు ప్రతి రోజూ వేల రుపాయల వ్యాపారం జరుగుతోంది. గతంలో గ్రామాలకు వచ్చే నాయకులకు దీనికితోడు గజమాల వేసేందుకు ఎక్స్‌కవేటర్‌ను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకుగాను గంటకు రూ.1000 బాడుగకు మాట్లాడి జీపుపై ఉన్న తమ నేతలకు గజమాలను వేస్తున్నారు. పూల వ్యాపారులు మాత్రం ఇదే మంచి తరుణమని వ్యాపారం జోరుగా సాగిస్తున్నారు. సగాని సగం వరకు లాభం వస్తుందని వ్యాపారులు తెలుపుతున్నారు.

మాట తప్పారు..



అట్లుంటది అన్నతోని..

తుగ్గలి, ఏప్రిల్ 24: ప్రజా సమస్యలు పరిష్కరించడంలో మాట తప్పను.. మడమ తిప్పను.. అని చెబుతూనే సీఎం జగన్ ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమయ్యారు. ఆరు నెలల క్రితం పత్తికొండలో రైతుభరోసా డబ్బులు ఖాతాలో జమ చేసేందుకు బటన్ నొక్కడానికి వచ్చిన సీఎం జగన్ మారెళ్ల, బొందిమడుగుల రహదారిని మరమ్మతులు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు కనీసం ఆ బ్రిడ్జి వైపు అధికారులెవరూ కన్నెత్తి కూడా చూడలేదు. దీంతో వంక దారిలో వెళ్తూ కిందకు పడుతూ లేస్తూ ప్రమాదాలకు గురవుతూ ప్రయాణాలు చేస్తున్నారు. పత్తికొండ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కరించకపోవడంతో నేరుగా సీఎం జగన్‌కు విన్నవించారు. నిండు సభలోనే వెంటనే ఆ కల్వర్టు పనులు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. అందుకు అనుగుణంగా ఎమ్మెల్యే శ్రీదేవి కూడా రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. అయితే.. ఇప్పటి వరకు ఆ కల్వర్టు వైపు ఒక్క అధికారి, పాలకులు కూడా కన్నెత్తి చూడలేదు.



బొందిమడుగుల, మారెళ్ల గ్రామాల మధ్య కూలిపోయిన ప్రధాన రహదారిలోని బ్రిడ్జి

144 సెక్షన్ ఎందుకు విధిస్తారంటే..

నంద్యాల (నూనెపల్లె), ఏప్రిల్ 24: ఎన్నికల సమయంలో అల్లర్లు జరిగే అనుమానం ఉన్న ప్రాంతాల్లో, పరీక్షల నిర్వహణ సమయంలో ఎక్కువగా 144 సెక్షన్ విధిస్తారు. 144 సెక్షన్ అంటే ఎమిటి, ఎప్పుడు విధిస్తారో తెలుసుకుందాం. సీఆర్‌పీసీసీ 144 సెక్షన్‌ల కింద ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్‌లకు విస్తృత అధికారాలు కల్పించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగినప్పుడు పరిస్థితులను అదుపులోకి తేవడానికి ఈ సెక్షన్ అమలు చేస్తారు. ఎన్నికల సమయంలో కూడా పోలింగ్ కేంద్రాల వద్ద దీన్ని విధిస్తారు. ఈ సెక్షన్ అమలులోకి వస్తే నలుగురు. ఐదు వ్యక్తులకు మించి గుమికూడకూడదు. కలిసి తిరగడంపై కూడ నిషేధాజ్ఞలు విధిస్తారు. ఎన్నికల సమయంలో నామినేషన్ ప్రక్రియల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యే వరకు ఈసెక్షన్ అమలులో ఉంటుంది. ఆసమయంలో ప్రదర్శనలు ఊరేగింపులు, ర్యాలీలు, చేపట్టకూడదు. ప్రధానంగా రెండు పార్టీలు గ్రూపుల మధ్య తగాదాలు తలెత్తినపుడు ఇది విధిస్తారు. రెండు నెలల వరకు కలెక్టర్, ప్రభుత్వం నియమించిన మెజిస్ట్రేట్ పోలీసు మ్యాన్యువల్ ప్రకారం ఎస్పీలు ఈ సెక్షన్‌లు అమలు చేస్తారు.

40 ఏళ్లలో తొలిసారి..!

● ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సొంతూరు కడిమెట్లకు మాజీ ఎమ్మెల్యే బీవీ



ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి స్వగ్రామం కడిమెట్లలో మహిళలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరు/ఎమ్మిగనూరురూరల్, ఏప్రిల్24: ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి స్వగ్రామం కడిమెట్ల. ఈ పంచాయతీలో సిరాలదొడ్డి, ఎర్రకోట, కడిమెట్ల, రాళ్లదొడ్డి గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాలపై చెన్నకేశవరెడ్డికి ఆది నుంచి పట్టు ఉంది. ఈ గ్రామాల్లో ఇప్పటి వరకు ఆయన చెప్పిందే వేదం.. ఏ పార్టీకి ఓటు వేయమన్నా ఆ పార్టీకి ఓట్లు వేస్తూ రావటం ఆనవాయితీ. అంతేగాక ఈ గ్రామాల్లో ఇప్పటి వరకు ప్రత్యర్థి రాజకీయ పార్టీలు అడుగుపెట్టిన దాఖలాలు లేవు. దాదాపు 40 ఏళ్ల తర్వాత కడిమెట్లలోకి టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి బుధవారం అడుగుపెట్టారు. గ్రామంలోని చెన్నకేశవస్వామిని, మారెమ్మవ్వను దర్శించుకున్నారు. దారి పొడవున గ్రామస్థులను పలుకరిస్తూ బీవీ ముందుకు వెళ్లారు. ఈ సందర్భంగా కొంతమంది మహిళలు గ్రామంలో తాగునీటి సమస్య ఉందని ఆయన దృష్టికి తెచ్చారు. కాగా దాదాపు 40ఏళ్ల తర్వాత టీడీపీ నుంచి పోటీలో ఉన్న బీవీ జయనాగేశ్వరరెడ్డి గ్రామంలో పర్యటించడంతో గ్రామస్థులు ఆసక్తిగా చూశారు. ఇదిలా ఉండగా ఇటీవలే ఎమ్మిగనూరులో జరిగిన నందమూరి బాలకృష్ణ పర్యటనలో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు విరుపాక్షిరెడ్డి, బాలకృష్ణారెడ్డి, చెన్నారెడ్డి టీడీపీలో చేరారు. వీరు ఆహ్వానించడంతో బీవీ గ్రామాన్ని సందర్శించారు. ఆయన వెంట రాళ్లదొడ్డి మురళి, పార్లపల్లి మల్లికార్జున, వెంకటేశ్వర్లు, సురేష్‌చౌదరి, చంద్ర ఉన్నారు.

ఓటు కోసం.. ఆట పాటలు

● కళాకారులతో ఎన్నికల ప్రచారం ● ఓటర్లను ఆకట్టుకునేందుకు అభ్యర్థుల పాట్లు

కర్నూలు (అర్బన్), ఏప్రిల్ 24: జిల్లాలో రాజకీయ పార్టీల ప్రచార సందడి జోరందుకుంది. గోడ రాతలు, పోస్టర్లు, కరపత్రాలు, సభలు సమావేశాలకు తోడు ప్రత్యేక గీతాలతో పార్టీలు, అభ్యర్థుల గుణ, గణాలు, హామీలు, పథకాలు వంటి వాటితో ప్రత్యేక పాటలను రికార్డు చేయించారు. జనాల మధ్య పాటల్ని ప్రచార సాధనాలుగా వినియోగిస్తున్నారు. విభిన్నమైన ప్రచార సాధనాలు వినియోగిస్తున్నారు. నామినేషన్ల స్వీకరణ నేటితో ప్రారంభం కావడంతో క్రమంగా ప్రచార పర్వాన్ని ఉధృతం చేశారు. ప్రధాన రాజకీయ పార్టీలతో పాటు ఆయా అభ్యర్థులు తమ పార్టీల పథకాలను గుర్తుకు తెచ్చేలా పాటలను ప్రత్యేకంగా కంపోజ్ చేయించి రికార్డు చేశారు. ఈ పాటల్ని డిజిటల్ విధానంలో లౌడ్ స్పీకర్లలో ఆకట్టుకునే సంగీతంతో ప్రజలకు వినిపించేందుకు ప్రత్యేకంగా



వాహనాలను తయారు చేశారు. సభలు, సమావేశాలు జరిగిన సందర్భాల్లో పలువురు గాయకులతో ఆకట్టుకునే విధంగా పాటలు పాడించడం, కళాకారులతో ప్రదర్శనలు ఇప్పించడం వంటివి చేస్తున్నారు.

ప్రధానంగా కర్నూలు నగరంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి టీజీ భరత్ ప్రత్యేకంగా తను ప్రకటించిన ఆరు గ్యారంటీలకు సంబందించి పాటలు పాడించడమే కాకుండా వాటి గురించి విస్తృత ప్రచారం చేస్తున్నారు.

● **కళాజాతా బృందాల బిజీ :** ఈ సారీ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధానంగా మూడు పార్టీల అభ్యర్థులు బరిలో ఉంటున్నారు. ఒక్కో పార్టీకి మూడు కళాజాతా బృందాలు అవసరం ఉంటున్నాయి. నియోజకవర్గంలో అభ్యర్థి వెంట ఒక బృందం, మిగతా రెండు బృందాలు ఇతర మండలాల్లో ప్రచారం చేస్తున్నాయి. ఓటర్లను ఆకట్టుకుంటూ ప్రవేశపెట్టిన పథకాలు ఇచ్చే హామీలు ప్రజల్లోకి చేరువ చేసేందుకు కళాజాతా బృందాలు శ్రమిస్తున్నాయి. ఎన్నికల పుణ్యమా అంటూ వారికి కూడా ఉపాధి లభించినట్లయింది.

● **ప్రతీ పాటకూ లెక్క..!**

ఆయా పార్టీల అభ్యర్థులు ప్రత్యేకంగా తమ పేర్లతో కూడిన పాటలను రికార్డు చేయించుకున్నారు. తమపేర్లు వచ్చేలా కనీసం మూడు నుంచి 6 పాటల దాకా రాయించి ప్రత్యేక సంగీతంతో ఆకట్టుకునేలా రికార్డు చేయించారు. ఇక ఆయా పార్టీల అధిష్ఠానం ఇచ్చే పాటలు అదనం. ఇందులో సాహిత్యం మొత్తం పార్టీ పథకాలను సూచించే విధంగా ఉంటున్నాయి. ప్రత్యేకంగా వీటి కోసం ఆరు నుంచి ఎనిమిది పాటలు సిద్ధం చేశారు. ఇక ఈ పాటలను ఎల్ఈడీ తెరపై వీడియోలు జత చేస్తూ ముస్తాబు చేశారు. పాటల రచయిత, సంగీతం, దర్శకుడు, స్టూడియో, వాయిద్య కళాకారులు, గాయకులు. వీడియో ఎడిటింగ్ కలిసి మొత్తం ఖర్చు చెల్లించాల్సి ఉంటుందిచీటి లేకున్నా వివరాలు తెలుసుకోవచ్చు

అట్టహాసంగా గౌరు చరిత నామినేషన్

- వేలాది మంది కార్యకర్తలతో భారీ ఊరేగింపు, బలప్రదర్శన
- కదంతొక్కిన టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు
- వైసీపీ దోపిడీ నాయకులకు బుద్ధి చెప్పండి: గౌరు చరిత


నామినేషన్‌కు తరలివచ్చిన వేలాదిమంది కార్యకర్తలు



కల్లూరు, ఏప్రిల్ 24: తెలుగుదేశం పార్టీ పాణ్యం నియోజకవర్గం అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే గౌరుచరిత నామినేషన్ దాఖలు చేశారు. బుధవారం నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని మోగా సిరి ఫంక్షన్‌హాల్లో గౌరు దంపతులు, కూటమి ఆధ్వర్యంలో నియోజకవర్గ నాయకులు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పాణ్యం, ఓర్వకల్లు, గడివేముల, కల్లూరు రూరల్, అర్బన్ నుండి వేలాదిగా టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు తరలివచ్చాయి. మోగా సిరి ఫంక్షన్‌హాల్ నుండి అశేష జనవాహిని తరలిరాగా గౌరు దంపతులు అభివాదం చేస్తూ భారీ ఊరేగింపు చేశారు. తప్పెట్లు, డోలు వాయిద్యాలు, నృత్య ప్రదర్శనలు, డీజే పాటలతో కర్నూలు నంద్యాల ప్రధాన రహదారి పసుపుమయంగా దర్శనమిచ్చాయి. నంద్యాల

టీడీపీ కూటమిదే విజయం : గౌరు చరిత

నామినేషన్ అనంతరం మీడియా పాయింట్ వద్ద గౌరు చరిత మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలనను అంతమొందించడానికే కూటమి ఏర్పడిందని, జగన్‌ను గద్దె దింపడమే లక్ష్యమని అన్నారు. పాణ్యం నియోజకవర్గంలో టీడీపీ వందశాతం గెలవబోతోందని అన్నారు. నియోజకవర్గంలో కబ్జాలు చేసి, ఎర్రమట్టి తవ్వకాలతో దోచుకుతిన్న నాయకులను ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు.


టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులతో కలిసి వెళ్తున్న గౌరు చరిత

జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, జనసేన నాయకుడు చింతా సురేష్, బీజేపీ నాయకుడు నాగరాజు కూటమి నాయకులతో కలిసి గౌరుచరిత జేసీ చాంబర్‌లో పాణ్యం రిటర్నింగ్ అధికారి నారపురెడ్డి మౌర్యకు నామినేషన్ పత్రాలను అందజేశారు.

రవాణాపై పటిష్ట నిఘా ఉంచాలి

ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.భార్గవతేజ

కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 24: ఎన్నికలు పూర్తయ్యే వరకు నగర సరిహద్దులు, ప్రధాన రహదారుల రవాణాపై పటిష్ఠమైన నిఘా ఉంచాలని కర్నూలు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి ఎ.భార్గవతేజ అన్నారు. బుధవారం కార్యాలయంలోని పాత కౌన్సిల్ హాలులో ఎన్నికల ప్రవర్తనా నియమావళి, ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేయిలెన్స్, వీడియో సర్వేయిలెన్స్ బృందాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఓ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు నగరంలోకి ప్రవేశించే వాహనా లను క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. ఓటర్లకు ప్రలోభానికి గురి చేసే డబ్బు, మద్యం, ఇతర వస్తువుల రవాణాపై నిఘా ఉంచాలన్నారు. అనుమానాస్పద వాహ నాలు, వ్యక్తులను నిశితంగా పరిశీలించాలన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల నియమావళి నోడల్ అధికారి రంగస్వామి, ఇన్‌చార్జి డిప్యూటీ సిటీ ప్లానర్ సంధ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు కేశవరెడ్డి అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న కేశవరెడ్డి

కర్నూలు(ఎడ్యుకేషన్), ఏప్రిల్ 24: పదో తరగతి ఫలితాల్లో కేశవరెడ్డి పాఠశాలల ఐఐటీ, మెడిసిన్ ఫౌండేషన్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బుధవారం స్థానిక వెంకటరమణ కాలనీలోని పాఠశాలలో అభినందన సభను నిర్వహించారు. ఈ సభకు కేశవరెడ్డి విద్యాసంస్థల వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.కేశవరెడ్డి హాజరైన మాట్లాడారు. ఎస్ఎస్‌సి-2024 ఫలితాల్లో స్థానిక వెంకట రమణ కాలనీలోని కేశవరెడ్డి పాఠశాల విద్యార్థులు ఎస్.సాయి స్వాతేజ్ 597/600, ఎస్.ప్రశాంత్ 596, కె.భావన 596, ఎస్.రజియా సుల్తానా 596, ఎస్.జయాన్ 595, ఎన్.రోషిని 594, పి.సుగంధిని రెడ్డి 593, జి.రోహిణి 593, ఏ.జీవన్‌శ్రీ 593, ఎం.భార్గవి 592, బి.లాస్య 590 మార్కులు సాధించారన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ర్యాంకులు సాదించిన విద్యార్థులను, అందుకు కృషి చేసిన ఉపాధ్యా యులను ఆయన అభినందించారు.

వైభవంగా కోన వెంకటేశ్వరస్వామి రథోత్సవం

సి.బెళగల్, ఏప్రిల్ 24: మండలంలోని క్రిష్ణదొడ్డి గ్రామంలో కొండపైన వెలసిన కోన వెంకటేశ్వరస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. రథోత్సవాన్ని తిల కించడానికి ఉమ్మడి జిల్లాల నుంచి కాక చుట్టు పక్కల మండలాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కోడుమూరు, గూడూరు, సి.బెళగల్ ఎస్ఐలు బాలనరసిముడు, హనుమంతయ్య, తిమ్మారెడ్డి, పోలీసులతో బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా సుంకులమ్మ దేవర

సి.బెళగల్, ఏప్రిల్ 24: మండలంలోని కంబంధహల్ గ్రామంలో సుంకులమ్మ దేవరను బుధవారం ఘనంగా నిర్వహిం చారు. భక్తులు బొనాలతో ఊరేగిం"పుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు.

పాఠశాలలో పైపులైన్ ధ్వంసం

ఓర్వకల్లు, ఏప్రిల్ 24: మండలంలోని నన్నూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో గుర్తు తెలియని వ్యక్తులు మరుగుదొడ్లు, పైపులైన్, తలుపులను ధ్వంసం చేశారు. బుధ వారం ఉదయం ఉపాధ్యాయులు పాఠశాలకు వెళ్లి చూడగా.. అప్పటికే మరుగు దొడ్లు, పైపులైన్, వాకిళ్లను ధ్వంసం చేసినట్లు గుర్తించి ఓర్వకల్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మే 1 నుంచి హాకీ సమ్మర్ క్యాంప్

కర్నూలు(స్పోర్ట్స్), ఏప్రిల్ 24: హాకీ కర్నూలు, హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వ ర్యంలో మే 1 నుంచి మున్సిపల్ హై స్కూల్‌లో హాకీ సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు హాకీ కార్యదర్శి దాసరి సుధీర్ బుధవారం తెలిపారు. ఈ క్యాంప్ కోచ్‌గా భరత్ ఉంటారనీ తెలిపారు. వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకో వాలని, వివరాలకు 9966565317 నెంబరును సంప్రదించాలని సూచించారు.

చంద్రకంటి మద్దయ్యకు డాక్టరేట్

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 24: తెలంగాణ సాంస్కృతిక పరిషత్ హైదరా బాద్ చంద్రకంటి మద్దయ్యకు డాక్టరేట్ ప్రకటించింది. ఆసియా ఇంటర్నెషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ (యూఎస్‌ఏ) ఆయన ప్రతిభను గుర్తించి డాక్టరేట్ అందించారు. మద్దయ్యను సంస్థ లయన్, డాక్టర్ ఆకుల రమేష్ అభినందించారు.

విజయవాణిలో ఉత్తమ ఫలితాలు


వైష్ణవి


చర్మిళ


రిషిత


కార్తీక్


గణేష్

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 24: చిత్తూరు జిల్లా చౌడేపల్లె మండలం విజయవాణి నగర్‌లోని విజయవాణి పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో 99.10శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కరస్పాండెంట్ నాయుని చంద్రశేఖర్‌మూర్తి తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పాఠశాలలో 111మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 110మంది ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. జి.వైష్ణవి 583 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచిందన్నారు. జి.చర్మిళ 577, ఎం.గణేశ్ 571, ఎం.కార్తీక్ 571, ఎం.రిషిత 572 మార్కులు సాధించినట్లు తెలిపారు. మరో 36 మంది 500 మార్కులకు పైగా సాధించినట్లు చెప్పారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను, ఉపాధ్యాయ బృందాన్ని ప్రిన్సిపాల్ జ్యోతిరాణి, హెచ్‌ఎం కరుణ, అకడమిక్ అడ్వయిజర్ పురుషోత్తంరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నాయుని గురుప్రసాద్ అభినందించారు.

'ఆర్థిక మంత్రి బుగ్గన చర్చకు రావాలి'

కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 24: కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచా యతీలకు పంపిన నిధులు రాష్ట్ర ప్రభుత్వం దొంగలించిన దానిపై మే 1న డోన్‌లో గాంధీ విగ్రహం దగ్గర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ రెడ్డిని చర్చకు రావాలని ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం కార్యాలయంలో ఆయన మాట్లాడు తూ కేంద్ర పంచాయతీలకు ఆర్థిక సంఘం ద్వారా పంపిన రూ.8629 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిందన్నారు. అయితే మంత్రి బుగ్గన ఆ నిధులు కరెంటు బిల్లులు చెల్లించామని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించార న్నారు. ఇది పూర్తిగా అవాస్తవమన్నారు. అసెంబ్లీ సాక్షిగా చెప్పిన విష యాన్ని అబద్ధం అని నిరూపించడానికి ఏపీ పంచాయితీరాజ్ చాంబర్, సర్పంచుల సంఘం సిద్ధంగా ఉందన్నారు.

మత రాజకీయాలకు స్వస్తి పలకాలి

కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్


టీడీపీలో చేరిన వారితో టీజీ భరత్

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 24: మత రాజకీయాలకు స్వస్తి పలకాలని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. బుధవారం బుధవారపేటలోని అమీన్ భాషా దర్గా ప్రాంతానికి చెందిన వాజీద్, భాషా, ఇమ్రాన్, తదితరులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఈసందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే కర్నూలు నగర ప్రజల కష్టాలు తీరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రామాంజనేయులు, నరసింహులు, క్రాంతి కిషోర్ పాల్గొన్నారు.

నేడు టీజీ భరత్ నామినేషన్

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 24: కర్నూలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా టీజీ భరత్ గురువారం నామినేషన్ వేయనున్నారు. ఉదయం 8.30 గంటలకు పెద్దమార్కెట్ నుంచి భారీగా ర్యాలీ చేపట్టనున్నట్లు టీడీపీ శ్రేణులు తెలిపాయి. ఈ ర్యాలీ పెద్దమార్కెట్, అంబేడ్కర్ సర్కిల్, జిల్లా కోర్టు, నాలుగ రోడ్ల కూడలి శ్రీలక్ష్మి స్కూల్ మీదుగా మున్సిపల్ కార్యాలయ వరకు సాగుతుంది. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు, టీజీ అభిమానులు భారీగా తరలిరావాలని కోరారు.

37వ వార్డులో గౌరు చరిత ప్రచారం


సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్న గౌరు చరిత

కల్లూరు, ఏప్రిల్ 24: కల్లూరు అర్బన్ 37వ వార్డు ఆదిత్యానగర్‌లో పాణ్యం టీడీపీ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత ఎన్నికల ప్రచారం చేశారు. అనంతరం ఆమె ఇంటింటికీ తిరిగి టీడీపీ సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రం బాగుంటుందన్నారు. టీడీపీ కూటమి అభ్యర్థుల ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నంద్యాల పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు కె.పార్వతమ్మ, జవ్వాజి. గంగాధర్ గౌడ్, శివ, కె. దనుంజయ, నాగరాజు, అంజనేయులు, శారద పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థుల తుది జాబితా

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 24: అఖిల భారత కాంగ్రెస్ పార్టీ కమిటీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కాంగ్రెస్ తుది జాబితా విడుదల చేశారని డీసీసీ కే.బాబురావు తెలిపారు. కర్నూలు అసెంబ్లీకి షేక్ జిల్లాని బాషా, ఎమ్మిగనూరు అసెంబ్లీకి ఎం. ఖాసీం వలి, మంత్రాలయం నియోజకవర్గం అసెంబ్లీకి పీఎస్ మురళీకృష్ణరాజు పేర్లను ఖారారు చేసిందని తెలిపారు.

గౌరు చరిత నామినేషన్‌కు తరలిన టీడీపీ శ్రేణులు

ఓర్వకల్లు, ఏప్రిల్ 24: పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత నామినేషన్‌కు ఓర్వకల్లు మండలంలోని పలు గ్రామాల నుంచి టీడీపీ శ్రేణులు కర్నూలుకు తరలివచ్చారు.

దస్తగిరి నామినేషన్‌కు..

కోడుమూరు(రూరల్)/ గూడూరు/ సి.బెళగల్, ఏప్రిల్ 24: కోడుమూరు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి నామినేషన్‌కు గూడూరు, కోడుమూరు, సి.బెళగల్ మండలాల నుంచి టీడీపీ శ్రేణులు వందలాది వాహనాల్లో తరలివెళ్లారు.

కోట్ల నామినేషన్‌కు..

కోడుమూరు(రూరల్)/గూడూరు, ఏప్రిల్ 24: టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి డోన్ అసెంబ్లీ అభ్యర్థిగా బుధవారం నామినేషన్ దాఖలు చేయడంతో కోడుమూరు, గూడూరు మండలాల నుంచి టీడీపీ శ్రేణులు తరలివెళ్లారు.

రాజకీయ పార్టీ ప్రతినిధులు హాజరుకండి

జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 24: ఈ నెల 26వ జరిగే నామినేషన్ల స్క్రూటిని రాజకీయ పార్టీ ప్రతినిధులు తప్పనిసరిగా హాజరయ్యేలా చూడాలని పాణ్యం రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య రాజకీయ పార్టీ ప్రతినిధులకు తెలియ జేశారు. బుధవారం తన చాంబర్‌లో జేసీ ఆయా రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల పేరు మార్పు (నామన్ క్లేచర్), ఆక్సిల్లారి పోలింగ్ కేంద్రాల కోసం కలెక్టర్ ద్వారా రాష్ట్ర ప్రధాన ఎన్నికల ప్రధానాధికారి దృష్టికి గతంలో తీసుకెళ్లామన్నారు. ఈ నెల 26న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు స్వీకరించిన నామినేషన్లను స్క్రూటిని చేస్తామన్నారు. ఈ నెల 29న వేసిన నామినేషన్లు ఉపసంహరించుకునే అవకాశం ఉం టుందన్నారు. ఈవీఎం కామిషనింగ్ మే 2 నుంచి 5వ తేదీ వరకు జరుగుతుందన్నారు. హోం ఓటింగ్ సంబంధించి పాణ్యం నియోజకవర్గంలో ఇప్పటి వరకు 159 దరఖాస్తులు వచ్చాయ న్నారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి సుమారు 4,600 వరకు దరఖాస్తులు వచ్చాయన్నారు. పాణ్యం నియోజకవర్గం ఫెసిలి టేషన్ సెంటర్‌ను బీ.క్యాంపులోని ప్రభుత్వ బాలురు పాఠశాలలో ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో సీపీఐ, వైసీపీ, టీడీపీ, బీఎస్పీ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

28న బాలికల క్రికెట్ జట్టు ఎంపిక

కర్నూలు(స్పోర్ట్స్), ఏప్రిల్ 24: స్థానిక డీఎస్ఏ ఔట్‌డోర్ స్టేడియంలో ఈ నెల 28న అండర్-15, 19 సీనియర్ బాలికలకు జిల్లా స్థాయి క్రికెట్ జట్టు ఎంపిక నిర్వహిస్తున్నట్లు క్రికెట్ సంఘం కార్యదర్శి కే.దేవేందర్ గౌడు బుధవారం తెలి పారు. అండర్ 15 బాలికలు 1.9.2009 తర్వాత, 31.8.2011లోపు జన్మించినవారై ఉండాలన్నారు. పుట్టిన తేదీ ధృవీకరణ పత్రంతో ఎంపికకు హాజరు కావాలని కార్యదర్శి తెలిపారు. వివరాలకు 9959251047 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

బెల్లం ఊట ధ్వంసం

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 24: 3200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు సెబ్ సీఐ కేఆర్ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. బుధవారం ఓర్వకల్లు మండలం గుమితం తాండ పరిధిలో విస్తృత దాడులు జరిపి బెల్లం ఊటను ధ్వంసం చేసి, 100 కేజీల బెల్లం, 50 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశామని తెలిపారు. ఎం.మాలిక్ భాషా అనే వ్యక్తిపై కేసు నమో దు చేశామన్నారు. ఈ దాడుల్లో సెబ్ ఎస్ఐ సీ. రెహనా బేగం, సిబ్బంది పాల్గొన్నారు.

17మంది వలంటీర్ల రాజీనామా

గూడూరు, ఏప్రిల్ 24: గూడూరు నగర పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న 17మంది వలంటీర్లు రాజీనామా పత్రాలను సమర్పించినట్లు నగర కమిషనర్ దివాకర్ రెడ్డి బుధవారం తెలిపారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర పంచాయతీ పరిధిలో ఆయా సచివాలయాల పరిధిలో పని చేస్తున్న 17 మంది వలంటీర్లు వ్యక్తిగత కారణాలతో రాజీనామా పత్రాలను సమర్పించార న్నారు. వలంటీర్ల రాజీనామా పత్రాలను జడ్పీ సీఈవోకు సమర్పించనున్నట్లు కమిషనర్ వెల్లడించారు. జడ్పీ సీఈవో నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే తదుపరి చర్యలు తీసుకోంటామని కమిషనర్ వెల్లడించారు.

కదిలివచ్చిన కోడుమూరు తమ్ముళ్లు


భారీగా తరలివచ్చిన టీడీపీ, జనసేన కార్యకర్తలు


టీడీపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి ఇంటి ఎదుట టీడీపీ శ్రేణుల కదనోత్సాహం

కోడుమూరు, ఏప్రిల్ 24: కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి నామినేషన్‌కు భారీగా తెలుగు తమ్ముళ్లు కదిలివచ్చారు. కర్నూలులోని టీడీపీ సీనియర్ నాయకుడు డి.విష్ణువర్ధన్‌రెడ్డి ఇంటి వద్దకు బుధవారం వేలాది మంది తెలుగు తమ్ముళ్లు చేరుకున్నారు. ఆయన ఇంటి వద్ద నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. టీడీపీ శ్రేణులు, అభిమానుల మధ్య ఊరేగింపుగా ఆర్డీవో కార్యాలయానికి చేరుకొన్నారు. ఆర్డీవో కార్యాలయంలో ఆయన బొగ్గుల దస్తగిరితో రెండు సెట్ల నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి శేషిరెడ్డికి ఇచ్చారు. అలాగే దస్తగిరి సతీమణి ఎం.సుధారాణితో కూడా ఒక సెట్ నామినేషన్ వేయించారు. కార్యక్రమంలో నియో జకవర్గ పరిశీలకుడు రామలింగారెడ్డి, పసుపుల సర్పంచు శీలమ్మ, టీడీపీ నాయకులు అమడగుంట్ల క్రిష్టారెడ్డి, సర్పంచుల సంఘం నాయకులు జయన్న, వేమనగౌడ్, కేతః మల్లికార్జునగౌడ్, బడె షాగౌడ్, గోపాల్‌నాయుడు, సీమోన్, దిన్నెదేవరపాడు సర్పంచు మాధవస్వామి పాల్గొన్నారు.

గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణం టీడీపీతోనే సాధ్యం : గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణం టీడీపీతోనే సాధ్యమని టీడీపీ సీనియర్ నాయ కుడు డి.విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. బొగ్గుల దస్తగిరి నామినేషన్ అనంతరం ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణం కోసం నాడు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు శంకుస్థాపన చేశారని అన్నారు. 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత గుండ్రేవుల ప్రాజెక్టు గురించి వైసీపీ నాయకులు మాట్లాడిన దాఖలాలు లేవు. వైసీపీ రాక్షస పాలనపై ప్రజలు విసుగెత్తారని ఈ ఎన్నికల్లో చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణాన్ని ఖచ్చితంగా చేప ట్టి రైతులకు సాగునీరు అందిస్తామన్నారు. అలాగే గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి పైప లైను ద్వారా నీటిని తీసుకొచ్చి కోడుమూరు ప్రజల తాగునీటి సమస్యను పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో అవసరమైన చోట చెక్ డ్యాంలు, నియోజవర్గంలోని చెర్వులకు ఎల్లెల్సీ, హంద్రీనీవా నుంచి నీళ్లు తీసుకొచ్చి రైతులకు సాగు, ప్రజలకు తాగునీరు అందిస్తామని అన్నారు. నియోజకవర్గంలోని గూడూరు, కోడుమూరు, సి.బెళగల్, కర్నూలు మండలాల్లోని వివిధ గ్రామాల నుంచి వందలాది వాహనాల్లో తెలుగు తమ్ముళ్లు తరలివచ్చారు.

అట్టహాసంగా బొగ్గుల దస్తగిరి నామినేషన్

విష్ణు వెంట తరలి వచ్చిన టీడీపీ శ్రేణులు


నామినేషన్ దాఖలు చేసేందుకు వెళ్తున్న బొగ్గుల దస్తగిరి, ఎదురూరు విష్ణు

టీడీపీ అధికారంలోకి వస్తే విద్యకు ప్రాధాన్యం

● ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి



విద్యార్థినికి స్వీటు తినిపిస్తున్న రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, ఏప్రిల్ 24: టీడీపీ అధికారంలోకి వస్తే విద్యకు ప్రాధాన్యం ఉంటుందని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి అన్నారు. మాధవరం గ్రామానికి చెందిన మిడపనూరు శ్రీనివాసులు కూతురు అరుంధతి పదవ తరగతిలో 555 మార్కులు సాధించడంతో ఆ విద్యార్థిని ఇంటికి వెళ్లి అభినందించారు. పల్లెపాడు రామిరెడ్డితో పాటు విద్యార్థిని ఇంటికి వెళ్లి ఆమెకు శాలువ కప్పి, మిఠాయి తినిపించి అభినందించారు. అత్యుత్తమ మార్కులు తీసుకువచ్చి మంత్రాలయం నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట రఘునాథరెడ్డి, రామకృష్ణారెడ్డి, రాకేష్ రెడ్డి, ముక్కన్న, ముద్దరాజు, తదితరులు ఉన్నారు.

టీడీపీకి ఓటు వేస్తేనే అభివృద్ధి: దేశాయి



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

నందవరం, ఏప్రిల్ 24: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి, ఎంపీ అభ్యర్థి పత్తిపాటి నాగరాజుకు ఓటు వేస్తేనే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దేశాయి మాధవరావు అన్నారు. బుధవారం మండలంలోని చిన్నకొత్తిలి, పెద్దకొత్తిలి గ్రామాల్లో మండల టీడీపీ నాయకులు ఇంటింటికి తిరిగి బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీకి అంతిమ గడియలు దగ్గర పడ్డాయని వచ్చేది టీడీపీ అని, ప్రతి ఒక్క కార్యకర్త సైనికుడిలా పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ కన్వీనర్ డీవీ రాముడు, నాయకులు కాశింవలీ, రైస్‌మిల్ నారాయణరెడ్డి, నాగరాజుగౌడు, గురురాజారావు, ధర్మపురం గోపాల్, బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

'టీడీపీ విజయానికి కృషి చేయాలి'

మద్దికెర, ఏప్రిల్ 24: పత్తికొండ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కేఈ శ్యాంబాబు విజయానికి సైనికుల్లా కష్టపడి కృషి చేయాలని మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి అన్నారు. బుధవారం ఎం.అగ్రహారం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీలు సుధాకర్ చౌదరి, శివ శంకర్, టీడీపీ నాయకుడు శ్రీనివాసులు కేఈ దంపతులను సన్మానించారు. రామూ యాదవ్, తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో పాత్రికేయుడి మృతి

వెల్దుర్తి, ఏప్రిల్, 24: రోడ్డు ప్రమాదంలో పాత్రికేయుడు బి. నరేష్ మృతి చెందాడు. ఈ ఘటన వెల్దుర్తిలో జరిగింది. బుధవారం సాయంత్రం నరేష్, మిత్రుడు రామంజనేయులతో కలసి బైక్ పై జాతీయ రహదారి-44లో వెళుతుండగా తమిళనాడుకు చెందిన లారీ వచ్చి ఢీ కొట్టింది. గాయపడిన ఇద్దరిని స్థానికులు హైవే అంబులెన్స్‌లో కర్నూలు సర్వజన వైద్యశాలకు తరలించారు. అప్పటికే పాత్రికేయుడు నరేష్ మృతిచెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మరోవ్యక్తి రామాంజనేయులు కాలు విరిగింది. మృతిచెందిన నరేష్‌కు భార్య, ఇద్దరు కుమారులు కలరు. విలేఖరి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని ప్రజలు తెలిపారు

విజయవాణిలో ఉత్తమ ఫలితాలు



వైష్ణవి | చర్మిళ | రిషిత



కార్తీక్ | గణేష్

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 24: చిత్తూరు జిల్లా చౌడేపల్లె మండలం విజయవాణి నగర్‌లోని విజయవాణి పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో 99.10శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కరస్పాండెంట్ నాయుని చంద్రశేఖర్‌మూర్తి తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పాఠశాలలో 111మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 110మంది ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. జి.వైష్ణవి 583 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచిందన్నారు. జి.చర్మిళ 577, ఎం.గణేశ్ 571, ఎం.కార్తీక్ 571, ఎం.రిషిత 572 మార్కులు సాధించినట్లు తెలిపారు. మరో 36 మంది 500 మార్కులకు పైగా సాధించినట్లు చెప్పారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను, ఉపాధ్యాయ బృందాన్ని ప్రిన్సిపాల్ జ్యోతిరాణి, హెచ్‌ఎం కరుణ, అకడమిక్ అడ్వయిజర్ పురుషోత్తం రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నాయుని గురుప్రసాద్ అభినందించారు.

మహిళ ఆత్మహత్య

కౌతాళం, ఏప్రిల్ 24: కుంటనహాల్‌లో బుధవారం ఓ మహిళ ఆత్మ హత్య చేసుకుంది. నందవరం మండలం కనకవీడు గ్రామానికి చెందిన శేకన్(32)కు కుంటనహాల్ గ్రామా నికి చెందిన ఇలియాసాబ్‌కు 13ఏళ్ల క్రితం వివాహమైంది. శేకన్ తరచూ పుట్టింటికి పోతుండటంతో ఇద్దరి మధ్య ఘర్షణ జరుగుతూ ఉండేది. మంగళ వారం కూడా గొడవ పడినట్లు తెలుస్తోంది. రాత్రి అందరూ నిద్ర పోయాక శేకన్ ఇంటి ముందర ఉన్న చెట్టుకు ఉరి వేసుకుంది. బుధవారం తెల్లవారుజామున ఇలియాసాబ్ నిద్రలేచి చూస్తే చెట్టుకు వేలాడుతున్న భార్య మృతదేహం కనిపించింది. మృతురాలి తల్లి మూబూబ్‌బీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు కౌతాళం హెడ్‌కానిస్టేబుల్ సోమ్లనాయక్ తెలిపారు. మృతురాలికి ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు.

పత్తికొండలో టీడీపీ జెండా ఎగరేద్దాం

● అభ్యర్థి కేఈ శ్యాంబాబు ● నామినేషన్ ర్యాలీకి భారీగా తరలివచ్చిన కార్యకర్తలు ● పాల్గొన్న మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి



ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న కేఈ శ్యాంబాబు



ర్యాలీకి తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు

పత్తికొండ, ఏప్రిల్ 24: తెలుగుదేశం కంచుకోటగా ఉన్న పత్తికొండ నియోజకవర్గంలో తిరిగి పార్టీ జెండా ఎగరేద్దామని ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబు పార్టీశ్రేణులకు పిలుపునిచ్చారు. నియోజకవర్గ పరిధి నుండి తరలివచ్చిన పార్టీ కార్యకర్తలతో కలసి స్థానిక ఎన్టీఆర్ విగ్రహం నుండి ఎంపీ అభ్యర్థి నాగరాజుతో కలసి కేఈ శ్యాంబాబు భారీ ర్యాలీగా బయలుదేరారు. గ్రామాల నుండి వేలాదిగా అభిమానులు, కార్యకర్తలు తరలిరావడంతో పత్తికొండ పట్టణం పసుపుమయంగా మారిపోయింది. కార్యకర్తల నినాదాల నడుమ 3 గంటలపాటు ప్రధాన రహదారిపై ర్యాలీ సాగింది. తేరుబజార్ వద్ద అభిమానులు కేఈ శ్యాంబాబును గజమాలతో సత్కరించారు. అనంతరం గుత్తిసర్కిల్‌లో మాజీ డిప్యూటీ ఈఎం కేఈ క్రిష్ణమూర్తి మాట్లాడుతూ జిల్లాలో అత్యంత వెనుకబడిన పత్తికొండ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడానికి హంద్రీనీవా నీటిని చెరువులకు నింపాలని పూర్తిస్థాయి నివేదికలు సిద్ధంచేసి 68 శాతం పనులు కూడా పూర్తిచేశామని, అయితే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఇప్పటి వరకు ఒక్క చెరువుకు నీటిని ఇవ్వలేకపోయిందన్నారు. పత్తికొండ ప్రాంతంలో నీటిసదుపాయాన్ని కల్పించి ప్రతిపొలానికి సాగునీరు అందే ప్రణాళికలతో ముందుకుసాగుతామని అన్నారు. రైతు బాగుపడితే ఊరు బాగుపడినట్లేనన్నారు. భూదందాలు, అక్రమవసూళ్లు, అక్రమమద్యం విక్రయాలు, ఇసుకదందాలు, కమీషన్ వసూళ్లలో బిజీగా ఐదేళ్ల గడిపిన ఎమ్మెల్యే తిరిగి ఓటు అడిగేందుకు వస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కేఈ హరిబాబు, సాంబశివారెడ్డి, బత్తిన వెంకటరాముడు, తుగ్గలినాగేంద్ర, నబీసాహెబ్, సుబ్బరాయుడు, కేఈ వేణుబాబు, కేఈ హరీష్‌లతోపాటు పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ర్యాలీకి భారీగా తరలివచ్చి యువత, మహిళలు

పత్తికొండలో జరిగిన కేఈ శ్యాంబాబు నామినేషన్ ర్యాలీకి గ్రామీణ ప్రాంతాల నుండి ఎక్కువగా యువత, మహిళలు తరలివచ్చారు. ఎండను లెక్కచేయక మండుటెండలో మహిళలు ర్యాలీలో మూడుగంటలపాటు ముందుకుసాగారు. పత్తికొండ మండలంలోని దూదేకొండ మాజీ సర్పంచ్ ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో 100 కుటుంబాలు టీడీపీలో చేరాయి.

రెండు సెట్లు నామినేషన్లు దాఖలుచేసిన కేఈ శ్యాంబాబు

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా కేఈ శ్యాంబాబు బుధవారం రెండుసెట్లు నామినేషన్ దాఖలుచేశారు. ఒకటి తుగ్గలినాగేంద్ర ప్రపోజల్‌చేయగా మరొకటి నబీసాహెబ్ ప్రపోజల్ చేశారు. అలాగే టీడీపీ అభ్యర్థిగా కేఈ హరిబాబు ఒక సెట్ నామినేషన్‌ను దాఖలుచేశారు. ఆర్‌వో రామలక్ష్మికి వారు నామినేషన్లను అందించారు.



నామినేషన్ దాఖలు చేసి వస్తున్న కేఈ శ్యాంబాబు, తుగ్గలి నాగేంద్ర తదితరులు

ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి

టీడీపీ ఎన్నికల జోనల్-5 సమన్వయకర్త వైకుంఠం ప్రభాకర్ చౌదరి



మాట్లాడుతున్న జోనల్ ఇన్‌చార్జి వైకుంఠం ప్రభాకర్ చౌదరి



సమావేశానికి హాజరైన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

ఆలూరు, ఏప్రిల్ 24: రాష్ట్రంలో అవినీతి పాలన అంతమొందించి, చంద్రబాబు ముఖ్యమంత్రి కావడానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని టీడీపీ ఎన్నికల జోనల్-5 సమన్వయకర్త వైకుంఠం ప్రభాకర్ చౌదరి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఉమా కళ్యాణ మండపంలో ఆలూరు నియోజకవర్గం టీడీపీ విస్తృత స్థాయి సమావేశం ఆలూరు టీడీపీ అభ్యర్థి వీరభద్ర గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి సభాధ్యక్షుడిగా ఎమ్మెల్సీ బీటీ నాయుడు వ్యవహరించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ చౌదరి మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న ఎన్నికల యుద్ధ కురుక్షేత్రంలో అవినీతిపరుడైన జగన్మోహన్‌రెడ్డిని మట్టి కరిపించాలన్నారు. ఈ యుద్ధంలో ప్రతి టీడీపీ కార్యకర్త 20 రోజులపాటు కష్టపడి పని చేయాలన్నారు. పార్టీలో ఉన్న చిన్న చిన్న మనస్పర్ధలు పక్కనపెట్టి చంద్రబాబును సీఎం చేయడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. సమష్టిగా కృషి చేసి ఆలూరులో వీరభద్ర గౌడ్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం ఒక ప్రణాళికను రూపొందించుకొని గ్రామాల్లోని ముఖ్య నేతలకు బాధ్యతలు అప్పగిస్తామని తెలిపారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే సాగు, తాగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు వేదవతి, నగరడోణ ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. ఆలూరు టీడీపీ అభ్యర్థి వీరభద్ర గౌడ్ మాట్లాడుతూ అందరి సహకారంతో ఆలూరులో టీడీపీ జెండా ఎగరేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మాజీ జిల్లా అధ్యక్షుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి కప్పట్రాళ్ల బుజ్జమ్మ మాజీ ఎంపీపీ రామచంద్ర నాయుడు, మాజీ మార్కెట్ చైర్మన్‌లు కురువ జయరాం, రాంనాథ్ యాదవ్, వైస్‌చైర్మన్ సాలి సాహెబ్, మాజీ జడ్పీటీసీ మీనాక్షి నాయుడు, రాష్ట్ర నాయకులు నారాయణ, నారాయణ రెడ్డి మండల కన్వీనర్లు అశోక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ఇరు పార్టీల నాయకుల సమావేశంలో వీరభద్రగౌడ్, వెంకప్ప

● ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు కలసి కట్టుగా పని చేయాలని ఆలూరు టీడీపీ అభ్యర్థి వీరభద్ర గౌడ్, జనసేన పార్టీ ఇన్‌చార్జి వెంకప్ప కోరారు. బుధవారం సాయంత్రం స్థానిక టీడీపీ కార్యాలంలో టీడీపీ, జనసేన పార్టీ నాయకుల సమావేశం నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని నిర్ణయించారు.

బాధపడకండి.. భవిష్యత్తు మనదే

ఎన్నికల ప్రచారంలో టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి



ఎస్ఎంటీ కాలనీలో ఓటు అభ్యర్థిస్తున్న బీవీ



తాపీ కార్మికులకు కరపత్రాలు అందజేస్తున్న బీవీ

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 24: వైసీపీ ప్రజా వ్యతిరేకంగా పాలన వల్ల బాధపడవద్దని, భవిష్యత్తు మనదేనని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం పట్టణంలోని ఎస్ఎంటీ కాలనీలో ఆయన విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఓటు అడిగేందుకు వెళ్లిన బీవీని పలువురు మహిళలు, యువతులు కలిసి తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, నీటి సరఫరా లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యకు మీరైనా పరిష్కారం చూపాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మిగనూరు పట్టణ ప్రజలకు సమృద్ధిగా తాగునీరు అందించాలనే లక్ష్యంతో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో జీడీపీ నుంచి రూ.146 కోట్లతో పట్టణానికి పైపులైన్ మంజూరు చేయిస్తే వైసీపీ ప్రభుత్వం ఆ పథకాన్ని చంపేసిందన్నారు. సాయంత్రం మండల పరిధిలోని బనవాసి, మల్కాపురం గ్రామాల్లో ప్రచారాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవి, కొండయ్యచౌదరి, మిఠాయి నరసింహులు, తురేగల్ నజీర్, జయన్న, రామకృష్ణనాయుడు, రంగస్వామిగౌడు, ఖలీముల్లా, కౌన్సిలర్లు రాందాసుగౌడు, దసాయాగర్, మండల నాయకులు మల్లికార్జున, సోమేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

● ఎమ్మిగనూరులోని బీవీ స్వగృహంలో బుధవారం రాత్రి ఎన్డీయే కూటమి నాయకులతో అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అనంతరం జయనాగేశ్వరరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, బీఎస్ ఈరన్న, జనసేన నాయకుడు నాగరాజు మాట్లాడుతూ మెగా డీఎస్సీ విడుదల చేస్తామని నిరుద్యోగులను వైసీపీ మోసం చేసిందని ఆరోపించారు.

గోనెగండ్ల: మండలంలోని బీ అగ్రహారం గ్రామంలో దుర్గామాత దేవరను బుధవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా హనుమాన్ శోభయాత్ర



హొళగుందలో హనుమాన్ శోభయాత్రలో పాల్గొన్న భక్తులు

హొళగుంద, ఏప్రిల్ 24: స్థానిక బాల ఆంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా విశ్వ హిందూ పరిషత్, భజరంగ్ దళ్ శాఖల ఆధ్వర్యంలో బుధవార ఉదయం వీర హనుమాన్ విజయ శోభయాత్ర నిర్వహించారు. హనుమంతుడి భారీ విగ్రహ మూర్తిని ట్రాక్టర్‌పై ఉంచి జై శ్రీరామ్ అంటూ ఊరేగించారు. యువకులు, ప్రజలు స్వామి వారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు బందోబస్తు నిర్వహించారు.

కేఈ నామినేషన్‌కు తరలిన తెలుగు తమ్ముళ్లు

తుగ్గలి, ఏప్రిల్ 24: పత్తికొండ టీడీపీ అభ్యర్థి కేఈ శ్యాంబాబు నామినేషన్‌కు తుగ్గలి మండలం నుంచి భారీగా నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. బుధవారం మండలంలోని తుగ్గలి, జొన్నగిరి, చిన్నజొన్నగిరి, చెన్నంపల్లి, గిరిజన తండాలతో పాటు అన్ని గ్రామాల నుంచి వేలాదిగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పత్తికొండ వెళ్లారు. టీడీపీ నాయకులు తుగ్గలి నాగేంద్ర, బత్తిన వెంకట్రాముడు, మనోహర్ చౌదరి, తిరుపాల్ నాయుడు, వెంకటస్వామి, వెంకటపతి, చంద్రశేఖర్ యాదవ్, లక్ష్మణస్వామి, బాలన్న, బలరాముడు ఉన్నారు. తరలివెళ్లారు.

మద్దికెర: పత్తికొండ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేఈ శ్యాంబాబు నామినేషన్‌కు మండలం నుంచి బుధవారం భారీగా కార్యకర్తలు, అభిమానులన తరలిచుకొని నాయకులు వెళ్లారు. మండల టీడీపీ ఇన్‌చార్జి కేఈ దివాకర్ గౌడు, మాజీ జడ్పీటీసీలు వి. పురుషోత్తం చౌదరి, జమేదార్ రాజన్న యాదవ్, జిల్లా టీడీపీ కార్యదర్శి గూడూరు ధనుంజయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు శివప్రసాద్ ఆధ్వర్యంలో వివిధ గ్రామాల నుంచి దాదాపు 2వేల మందికి పైగా తరలివెళ్లారు.



పత్తికొండకు బయలుదేరిన టీడీపీ నాయకులు